

సీఎం చంద్రబాబు సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవ తేజ, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

పొన్నెకల్లుకు 14న సీఎం చంద్రబాబు

- అంబేడ్కర్ జయంతి వేడుకలకు ఏర్పాట్లు
- అధికారులు కలిసి కట్టుగా పనిచేయాలని కలెక్టర్ ఆదేశాలు

తాడికొండ(పొన్నెకల్లు), ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో సోమవారం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ జయంతి వేడుకలకు తాడికొండ మండలం పొన్నెకల్లు గ్రామం వేదికగా ఎంపిక చేశారు. ఈ జయంతి వేడుకలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హాజరుకానున్నారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో గురువారం ఇన్‌చార్జి కలెక్టర్ ఏ.భార్గవతేజ, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులతో సమావేశాన్ని నిర్వహించి అధికారులకు బాధ్యతలు అప్పగించారు. ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ పొన్నెకల్లులో రాష్ట్ర స్థాయిలో జరిగే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి కార్యక్రమాన్ని అధికారులందరు సమన్వయంతో విజయంతం చేయాలని కోరారు. రాష్ట్రంలో పేదరికం లేకుండా రూపు మాపేందుకు ముఖ్యమంత్రి చేపట్టిన పీ-4 మార్గదర్శి - బంగారు కుటుంబం కాన్సెప్ట్‌తో కార్యక్రమం జరగనున్నదన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ మురళీకృష్ణ, సీపీవో శేషశ్రీ, డీఆర్‌డీఏ డ్వామా పీడీ విజయలక్ష్మి, శంకర్, డీపీవో నాగసాయి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాబాయి, పౌర సరఫరాల అధికారి కోమలి పద్మ,తాహసీల్దార్లు వెంకటేశ్వర్లు, మెహర్‌కుమార్, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు తలశిల ప్రసన్నకుమార్, అధికార ప్రతినిధి గుంటు పల్లి మధుసూదనరావు, ఎడ్డూరి హనుమంతరావు, కొమ్మినేని రామచంద్రరావు, పంచాయతీ కార్యదర్శి షేక్ జానీ తదితరులు పాల్గొన్నారు.

సొసైటీల కంప్యూటరీకరణతో పురోగతి

- జాయింట్ కలెక్టర్ సూరజ్ గనేరో ధనుంజయ్

నరసరావుపేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలలో కంప్యూటరీకరణ గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మకమైన పురోగతి అని జేసీ సూరజ్‌గనేరో ధనుంజయ్ తెలిపారు. అంతర్జాతీయ సహకార సంవత్సరం సందర్భంగా స్థానిక సహకార బ్యాంకులో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కంప్యూటరీకరణతో ప్రతీ లావాదేవీ డిజిటల్ రికార్డ్‌గా ఉండటంతో అవినీతిని అరికట్టవచ్చన్నారు. రుణాల మంజూరు, చెల్లింపు, విత్తనాల పంపిణీ వంటి సేవలు త్వరగా జరిగే అవకాశం ఉంటుందన్నారు. రైతుల వివరాలు, ఖాతాల సమాచారం, నిధుల వినియోగం వంటి విషయాలు ఒక్క క్లిక్‌తో తెలుసుకోవచ్చన్నారు. వ్యవసాయ రంగాన్ని ఆధునికీకరించడానికి ఇదొక ముఖ్యమైన దశ అని చెప్పారు. ప్రభుత్వం సహకార రంగ అభివృద్ధికి నిధులు కేటాయించి, కంప్యూటరీకరించాలని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఈ ప్రాజెక్ట్ కింద పీఏసీఎస్‌లకు ఆధునిక సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ సమకూర్చడం జరిగిందని తెలిపారు. జిల్లాలోని అన్ని పీఏసీఎస్‌లను కంప్యూటరీకరణ చేసిన సందర్భంగా పీఏసీఎస్ సీఈవోలను, బ్యాంక్ సిబ్బందిని, డిపార్ట్మెంట్ ఆడిటర్లను జేసీ అభినందించారు. అందరూ కలిసికట్టుగా పనిచేస్తే, ప్రతి పీఏసీఎస్ ఒక డిజిటల్ మోడల్‌గా మారుతుందని జిల్లా సహకార అధికారి వెంకటరమణ తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ సూరజ్ గనేరో ధనుంజయ్

కుంభకోణంపై.. కనికరమా?



చెయ్యి మార్చగా రూ.6.8 కోట్లు మిగులు

గోలీల డొంక రోడ్డులో కొత్తపాలెం సమీపంలో కొన్న భూముల్లో మాత్రం వైసీపీ ముఖ్య నేతకు దగ్గరి అనుచరుడు, అర్థిక లావాదేవీలన్నీ దగ్గరుండి చూసుకున్న వ్యక్తి భూములు చేతులు మార్చి రోజుల వ్యధిలోనే రూ.6.8 కోట్లు వెనకేశారనేది ఆరోపణ. ఈయన తన బంధువుల పేరుపై 13 ఎకరాలను రూ.40 లక్షలు చొప్పున కొనుగోలు చేశాడు. ఆ తర్వాత వారానికే ఆ భూములను ప్రభుత్వానికి అమ్మేసి రూ.6.8 కోట్లు జేబులో వేసుకున్నాడని సమాచారం.

- విజిలెన్స్ విచారణపై అనుమానాలు
- జగనన్న కాలనీల పేరిట భూ కొనుగోల్‌మాల్
- తెనాలిలోనే రూ.100 కోట్లు చేతులు మారినట్లు ఆరోపణలు
- నాడు వైసీపీ నేతలకు మేలు చేసిన కొందరు అధికారులు
- వారిని కాపాడేందుకే విచారణలో తాత్సారమన్న ఆరోపణలు

నాడు పేదలకు సొంతిల్లని జగనన్న కాలనీల పేరిట భూ కుంభకోణానికి పాల్ప డిన వైసీపీ పెద్దల గుట్టురట్టు చేయాల్సిన అధికారులు కనికరం చూపుతున్నారు. ఒక్క తెనాలిలోనే రూ.100 కోట్లు కొట్టేసిన భూ కుంభ కోణం అంతుతేల్చేందుకు కూటమి ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశిం చింది. అయితే ఈ విచారణ జరుగుతున్న తీరు చూస్తే నాడు భూమాయలో భాగ స్వాములను కాపాడేటట్లుగా ఉందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. క్విడ్‌ప్రోకో పద్ధతిలో అప్పటి ప్రభుత్వంలోని పెద్దలు భారీగానే ప్రజా ధనాన్ని దోచేశారని నాడు విమర్శలు వెల్లువెత్తాయి. అయితే నాటి ప్రభుత్వంలో అటు పాలకులు, ఇటు అధికా రులు దీని గురించి పట్టించుకోలేదు. రాష్ట్రవ్యాప్తంగా దోపిడీ జరిగినా, భారీ మొత్తం చేతులు మారింది మాత్రం తెనాలిలోనే అని కూటమి ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. తెనాలిలో జరిగిన ఈ భూమాయ గుట్టును విజిలెన్స్ అధికారులు బహిర్గతం చేస్తే రాష్ట్రంలో మిగిలిన నియోజకవర్గాల్లో జరిగిన కుంభకోణాల్ని బట్టబయలు చేసేందుకు ఒక ఉదాహరణగా మారనుంది. అయితే ఇంతటి ప్రాధాన్యం ఉన్న కుంభకోణంపై విచారణ నెల నుంచి కొనసా...గుతూనే ఉంది. అధికారులు సంబంధిత రైతులను అడుగుతున్న ప్రశ్నలు, వారు చెబుతున్న సమాధానాలు చూస్తుం టే అసలు ఈ కుంభకోణం గుట్టు వీడుతుందా? దీని వెనకున్న పెద్దలకు శిక్షలు వేసి.. దోచుకున్న ప్రజాధనాన్ని కక్కిస్తారా అంటే అనుమానమే అని అర్థమవుతోంది.

ఎకరాకు.. రూ.52.51 లక్షలు స్వాహా

జగనన్న లేఅవుట్లు ఎక్కడనేది తెలుసుకున్న వైసీపీ నాయకులు కొందరు ముందుగానే రైతుల నుంచి ఎకరాకు రూ.35 లక్షల నుంచి రూ.40 లక్షలు చెల్లించి పొలాలు కొనుగోలు చేశారు. బినామీ పేర్లతో వాటిని ప్రభుత్వానికి రూ.92.51 లక్షలు అమ్మారు. వారం రోజుల్లోనే వీరికి ఎకరాకు రూ.52.51 లక్షలు అప్పనంగా వచ్చి చేరింది. భూమిని నమ్ముకుని ఉన్న రైతుకు రూ.40 లక్షలే అందితే, వారంలో చేతులు మార్చిన వైసీపీ దళారులకు ఎకరాకు రూ.52 లక్షలు దక్కింది.

తెనాలి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కలను నిజం చేస్తామంటూ కోట్లకు కోట్లు వైసీపీ పెద్దలు దోచేశారు. కాలనీలు కాదు.. ఊళ్ళు నిర్మిస్తున్నామని జేబులు నింపుకున్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇంతగొప్ప కార్యక్రమం చేసిన ప్రభుత్వమే లేదని భూమాయ చేశారు. ఇది ఒక్క గుంటూరు జిల్లానే కాదు. రాష్ట్రం మొత్తం మీద (మిగతా 8వ పేజీలో)

ముఖ్య నేత పేరుతో వసూళ్లు..

బుర్రిపాలెం, నేలపాడు, అంగలకుదురు, గుడివాడ, కొలకలూరులలో కొన్న భూములకు ఎకరాకు రూ.10 నుంచి రూ.20 లక్షల వరకు వాటాల కింద వసూలు చేశారు. అదేమంటే ఈ డబ్బు ముఖ్య నేతకు ఇవ్వాలంటూ నిలబెట్టి వసూలు చేశారని రైతులు చెప్తున్నారు. ఒక ప్రవచన కర్త ఇంటిపేరుతో ఉన్న రైతు 6.5 ఎకరాలు ప్రభుత్వానికి ఇచ్చినందుకు అందిన మొత్తంలో నేతలకు వాటా రూపంలో ఇచ్చిన మొత్తమే రూ.1.8 కోట్లు అంటే, ఎంతటి స్థాయిలో డబ్బు చేతులు మారిందనేది అర్థమవుతుంది. ఓ లేఅవుట్‌లో 12 మంది 36 ఎకరాల భూమిని ఇచ్చినందుకు నేతలకు ఇచ్చిన వాటా రూ.8 కోట్లని సమాచారం. ఇలా మొత్తం 526 ఎకరాల్లో అందిన మొత్తం లెక్కిస్తే కళ్ల తిరగాల్సిందే.



నేలపాడులో ఆగిపోయిన పేదల ఇళ్లు

జిన్నింగ్..దివాలా

నష్టాల ఊబిలో పరిశ్రమ



- 400 మిల్లుల్లో పనిచేస్తున్నవి 120 మాత్రమే
- రూ.30 కోట్ల ప్రోత్సాహకాల కోసం ఎదురుచూపు
- పన్నుల భారం తగ్గించాలని యజమానుల విజ్ఞప్తి

గుంటూరు సిటీ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు కళకళలాడిన జిన్నింగ్ పరిశ్రమ దివా లా దిశగా సాగుతోంది. ఉత్పత్తి వ్యయం పెరిగిపోవడం.. పత్తి విస్తీర్ణం పూర్తిగా పడిపోవడం.. పన్నులు మోత.. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహ కాలు లేకపోవడం.. తదితరాల నేపథ్యంలో పరి శ్రమను నష్టాల ఊబిలో పడేస్తోంది. ఫలితంగా రాష్ట్ర వ్యాప్తంగా గతంలో 400 వరకు ఉన్న జిన్నింగ్ మిల్లులు ప్రస్తుతం కేవలం 120 మా త్రమే ఉనికిలో ఉన్నాయి. గుంటూరు రీజియన్‌లో 60 మిల్లులు, రాయలసీమ రీజియన్‌లో 60 మిల్లులు ఉండగా ప్రభుత్వం నుంచి సుమారు రూ.30 కోట్ల వరకు ప్రోత్సాహకాలు రావాల్సి ఉంది. గడిచిన ఐదేళ్ల కాలంలో వాటి విడుదల కోసం చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయని యజమానులను అసంతృప్తి చెందుతున్నారు. 2014 తర్వాత విభజిత రాష్ట్రంలో పత్తి విస్తీర్ణం పూర్తిగా పడిపోవడం పరిశ్రమకు కోలుకోలేని దెబ్బ తగులుతుంది. ప్రస్తుతం రాష్ట్రంలో 10 లక్షల బేళ్లకు సరిపడా మాత్రమే పత్తి దిగుబడి వస్తుండగా, ఉనికిలో ఉన్న జిన్నింగ్ మిల్లులు 30 లక్షల బేళ్ల సామర్థ్యం కలిగి ఉన్నాయి. దీంతో ఖరీఫ్ సీజన్‌లో మాత్రమే మిల్లులు ఆడే పరిస్థితి నెలకొంది. మిగిలిన సంవత్సరమంతా మూతపడి ఉంటున్నా విద్యుత్ చార్జీలు, ఇతర పన్నుల భారం మాత్రం తప్పడం లేదు. మిగిలిన రాష్ట్రాల్లో పత్తి ఆధారిత పరిశ్రమలకు విద్యుత్ రాయితీలు పుష్కలంగా ఇస్తున్నా ఇక్కడ ఆ విధానం లేదు. హై టెన్షన్‌లో జిన్నింగ్ పరిశ్రమలను చూపడంతో కనీస డిమాండ్ చార్జీలు ఎక్కువగా పడుతున్నట్లు యజమాను లు చెబుతున్నారు. రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్ ము గిసిన తర్వాత కొందరు జిన్నర్స్ ఇతర రాష్ట్రాల నుంచి పత్తిని కొనుగోలు చేయడం వల్ల రెండు రాష్ట్రాల్లో మార్కెటింగ్ సెస్సు చెల్లించాల్సి వస్తోంది. ఈ క్రమంలో ఇటీవల ఏపీ టీఎంసీ కన్సార్టీయం రాష్ట్ర అధ్యక్షుడు ఇక్కుర్తి శివ ప్రసాద్, సీనియర్ నాయకుడు మన్నవ హరి గుంటూరులో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను కలిసి సమస్యలను వివరించారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన ప్రోత్సాహకాలు వెంటనే విడుదల చేయించాలని, బ్యాంకు వడ్డీ రేట్లలో కొంత వరకు తగ్గించాలని, జీఎస్టీ రాయితీ కల్పించాలని, మార్కె టింగ్ సెస్సు పూర్తిగా తగ్గించాలని, పత్తి విస్తీర్ణం పెంచేందుకు తెగుళ్లను తట్టుకునే మంచి వంగడాలను రైతులకు సరఫరా చేయాలని, రాష్ట్రంలో సీసీఐ పత్తి కొనుగోళ్ల పెంచాలని కోరారు.

పాలిసెట్.. పాట్లు

- ఫీజు చెల్లింపులో సాంకేతిక సమస్యలు
- ఉండీ ఉపయోగం లేని హెల్ప్‌లైన్ సెంటర్
- విద్యార్థుల ఇబ్బందులపై స్పందించని సిబ్బంది

గుంటూరు(విద్య), ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పాలిసెట్ గడువు సమీపిస్తోంది. పరీక్షకు ఫీజు చెల్లించేందుకు విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాంకేతిక సమస్యల కారణంగా ఫీజు చెల్లింపులో అవాంతరాలు ఎదురవుతున్నాయని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. మంగళగిరిలోని సాంకేతిక శాఖ ప్రధాన కార్యాలయంలో సిబ్బంది విద్యార్థుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించడంలేదు. ఇక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసినా దానివల్ల ఫలితం లేదని విద్యార్థులు వాపోతున్నారు. పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశం కోసం సాంకేతిక విద్యాశాఖ పాలిసెట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఏటా పాలిసెట్‌కు దాదాపు 20 వేల మందికి పైగా విద్యార్థులు హాజరవుతుంటారు. ఈ పరిస్థితుల్లో ఈ ఏడు పాలిసెట్‌కు ఈ నెల 15వ తేదీ చివరి తేదీగా గడువు ఇచ్చింది. గత నెల చివర్లో పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు భారీ సంఖ్యలో పాలిసెట్ రాసేందుకు సన్నద్ధమయ్యారు. పదో తరగతి హాల్‌టికెట్ నంబర్ ద్వారా పాలిసెట్‌కు దరఖాస్తుకు సాంకేతికశాఖ అవకాశం ఇచ్చింది. అయితే హాల్ టికెట్లోని వివరాలతో పాటు అదనపు సమాచారం నింపి పరీక్ష ఫీజు చెల్లింపు కోసం విద్యార్థులు చేస్తున్న ప్రయత్నాలు విఫలమవుతున్నాయి. అనేకమంది విద్యార్థులు డెబిట్ కార్డును ఉపయోగించి ఫీజు చెల్లిస్తున్నారు. అయితే ఫీజు చెల్లింపు స్టేటస్‌లో ఫీజు చెల్లించలేదని లేదని ఆన్‌లైన్ ప్రత్యక్షమవుతుంది. మొత్తం ప్రక్రియ పూర్తి చేసి నగదు కట్ అయినా ఫీజులు జమ కాలేదంటూ సాంకేతిక విద్యా శాఖ నుంచి ఫోన్లకు వస్తున్న సమాచారంతో విద్యార్థులు బెంబేలెత్తుతున్నారు. దీంతో ఏమి చేయాలో పాలుపోక విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.



06 Apr 2025	
Debited	₹ 400.00 Dr
Description	POS:SBTETAP/ Mumbai/509611044766
05 Apr 2025	
Debited	₹ 400.00 Dr
Description	POS:SBTETAP/ Mumbai/509513972963

ఓ విద్యార్థి రెండుసార్లుగా చెల్లించిన పరీక్ష ఫీజు బ్యాంకు రశీదులు

స్పందించని హెల్ప్‌లైన్ సెంటర్లు

పాలిసెట్ విద్యార్థుల సమస్యలకు పరిష్కారం కోసం మంగళగిరిలో ప్రత్యేకంగా హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఇందులో ఇందులో డేటా ఎనాలసిస్ట్, సాంకేతిక విద్యాశాఖ సెక్రటరి కార్యాలయ సిబ్బంది, మరో రెండు హెల్ప్‌లైన్ సెంటర్ నెంబర్లు పొందుపరిచారు. అయితే ఈ నెంబర్లకు ఫోన్ చేసినా అక్కడి నుంచి స్పందన రావడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాంకేతిక సమస్యలను కార్యాలయ సిబ్బంది దృష్టికి తీసుకువెళ్లాలన్నా ఫలితం ఉండడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ల్యాండ్‌లైన్ నెంబర్ కూడా పనిచేయడం లేదని ఫలితంగా సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో అర్థంకావడంలేదంటున్నారు. చివరకు మెయిల్ చేస్తే మీ డబ్బు 15 రోజుల్లో తిరిగి మీ ఖాతాకే వస్తుందన్న సమాచారం పంపి చేతులు దులుపుకుంటున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు.



మంగళగిరిలోని హెల్ప్‌లైన్ సెంటర్ ఫోన్ నెంబర్లు

మంగళగిరిలో.. అత్యాధునికంగా ఆస్పత్రి

- దేశానికి రోల్‌మోడల్‌గా వంద పడకలతో నిర్మాణం
- 13న శంకుస్థాపన చేయనున్న మంత్రి లోకేశ్

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): అత్యాధునిక వైద్య సదుపాయాలతో.. కార్పొరేట్ ఆస్పత్రులకు ధీటుగా.. దేశానికే రోల్ మోడల్‌గా మంగళగిరిలో వంద పడకల ఆస్పత్రి నిర్మించనున్నారు. మంగళగిరి నియోజకవర్గ ప్రజల మూడు దశాబ్దాల కలకి ఈ నెల 13న మంత్రి నారా లోకేశ్ శంకుస్థాపన చేయనున్నారు. వంద పడకల ఆస్పత్రిని దేశంలోనే అత్యుత్తమంగా తీర్చిదిద్దాలని మంత్రి నారా లోకేశ్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఏడాదిలోగా నిర్మాణాన్ని పూర్తి చేయాలని సూచించారు. యువగళం పాదయాత్ర సందర్భంగా మంగళగిరి ప్రభుత్వ ఆస్పత్రిని వంద పడకల ఏరియా ఆస్పత్రిగా అభివృద్ధి చేస్తానని లోకేశ్ హామీ ఇచ్చారు. గతేడాది అక్టోబరు 23న జరిగిన మంత్రివర్గ సమావేశంలో మంత్రి లోకేశ్ ప్రతిపాదనను మంత్రివర్గం ఆమోదించింది. దీంతో 1986లో ఏర్పాటు చేసిన ఆస్పత్రి భవనం శిథిలం కావడంతో వైద్యశాలను చినకాకాని వద్దకు మార్చి, కేన్సర్ ఆస్పత్రి స్థలాన్ని వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి కేటాయించారు. 7.35 ఎకరాల్లో లక్షా 15 వేల చదరపు అడుగుల్లో సువిశాలంగా ఆస్పత్రి భవనాన్ని రూ.52.20 కోట్లతో నిర్మించనున్నారు. ఆస్పత్రిలో మెడికల్, సర్జికల్, ఆర్థో, గైనిక్, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్ విభాగాలు, మూడు ఆపరేషన్ థియేటర్లు, డయాలసిస్ సెంటరు, తలసేమియా వార్డు, డీ అడిక్షన్ ఓపీ సెంటరు అందుబాటులోకి తేనున్నారు.



వంద పడకల ఆస్పత్రి తాలూకూ నమూనా చిత్రం

ఫైనాన్స్ కంపెనీ ఆగడాలతో మహిళ ఆత్మహత్య

భట్టిప్రోలు (కొల్లూరు), ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : ఫైనాన్స్ కంపెనీ ఆగడాలను రుణ గ్రహీతలు తట్టుకోలేకపోతున్నారు. వాయిదాలు చెల్లించలేదని రుణగ్రహీతలపై దౌర్జన్యాలకు పాల్పడటంతో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని వెల్లటూరుకు చెందిన బాణావత్ పార్వతి (45) గోవింద్ దంపతులు రెండేళ్ల క్రితం ఫైవ్‌స్టార్ ఫైనాన్స్ కంపెనీలో తమ ఇంటిని తనఖా పెట్టి రూ.3 లక్షలు రుణం తీసుకున్నారు. ఇటీవల ఆర్థిక ఇబ్బందుల కారణంగా వాయిదాలు సక్రమంగా చెల్లించకపోవడంతో కంపెనీ ఏజెంట్లు పార్వతి ఇంటిలోని సామాన్లు బయటకు విసిరేయడంతో పాటు ఇంటికి తాళం వేశారు. స్థానికులు, బంధువులు ఏజెంట్లను బతిమలాడి నచ్చజెప్పడంతో మరో దఫా వాయిదాలు సక్రమంగా చెల్లించకపోతే ఊరుకోమని హెచ్చరించి ఇంటికి వేసిన తాళాన్ని ఇచ్చి వెళ్లారు. ఈ సంఘటనో మనస్థాపానికి గురైన పార్వతి మంగళవారం సాయంత్రం ఇంటిలో ఉరి వేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే కొన ఊపిరితో ఉన్న ఆమెను తెనాలి వైద్యశాలకు అక్కడ నుండి గుంటూరు వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. కుమారుడు శివశంకర్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ శివయ్య ఫైనాన్స్ కంపెనీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పిన్నెల్లి సోదరుడు మాకు అన్యాయం చేశాడు

ఎస్పీ ఎదుట అనాథ వృద్ధ దంపతుల ఆవేదన



ఎస్పీ శ్రీనివాసరావు ఎదుట ఆవేదన వ్యక్తం చేస్తున్న వృద్ధ దంపతులు

మాచర్ల రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోదరుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి తమ కేసు పరిష్కారం కాకుండా అడ్డుకొని అన్యాయం చేశారని పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఎదుట అనాథ వృద్ధ దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు జరిగిన అన్యాయంపై గతంలో వారు ఫిర్యాదు చేశారు. దానిపై విచారణకు ఎస్పీ గురువారం విజయపురి సౌత్ వచ్చారు. మండలంలోని విజయపురిసౌత్‌లో నివాసం ఉంటున్న అరికట్ల బ్రహ్మారెడ్డి, విజయలక్ష్మి వృద్ధ దంపతులు 8.5 ఎకరాల పొలంతోపాటు ఆస్తులను మొత్తం అమ్మి తమ కొడుకు అంజిరెడ్డిని ఉన్నత చదువులు చదివించడంతో, అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా స్థిరపడ్డారని చెప్పారు. అయితే తాము అనారోగ్యంతో బాధపడుతున్నా, తమ కొడుకు అంజిరెడ్డి తమను పట్టించుకోవడం లేదన్నారు. తమ పరిస్థితి మరింత దుర్భరంగా మారడంతో, ఆత్మహత్యాయత్నానికి కూడా యత్నించామని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో మాచర్ల పోలీసులకు తమ కొడుకుపై ఫిర్యాదు చేస్తే పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి, తమ కుమారునికి మద్దతుగా నిలిచి కేసు పరిష్కారం కాకుండా చేశాడన్నారు. ఎన్నిసార్లు ఉన్నతాధికారులను కలిసి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. దిక్కులేక కోర్టులో కేసు వేశామని, నెలకు రూ. 10 వేలు భరణం ఇవ్వాలని కోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. కోర్టు తీర్పును కూడా తమ అంజిరెడ్డి ఖాతరు చేయలేదని ఎస్పీకి తెలిపారు. న్యాయం తప్పక చేస్తామని ఎస్పీ శ్రీనివాసరావు వృద్ధ దంపతులకు హామీ ఇచ్చారు. ఎస్పీ వెంట మాచర్ల తహసీల్దార్ కిరణ్‌కుమార్, మాచర్ల రూరల్ సీఐ నఫీజ్‌బాషా, విజయపురిసౌత్ ఎస్ఐ మహ్మద్ షఫి ఉన్నారు.

డీఎస్సీ కి ఆన్ లైన్ లో ఉచిత శిక్షణ

గుంటూరు (విద్య) ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ పరీక్షకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఆన్లైన్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ సంక్షేమ శాఖ అధికారి కే మయూరి గురువారం ఒక ప్రకటన లో తెలిపారు. అభ్యర్థులు టెట్ పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలని వార్షిక ఆదాయం లక్షలోపు ఉండాలని సూచించారు. ఆసక్తి అర్హత ఉన్న అభ్యర్థులు దరఖాస్తుతో పాటు పదవ తరగతి మార్కుల జాబితా, టీటీసీ లేదా బీఈడీ పాస్ అయినట్లు సర్టిఫికెట్లు, తల్లిదండ్రుల వార్షిక ఆదాయ ధ్రువీకరణ పత్రం,రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు, ఆధార్ తదితర వివరాలను గుంటూరు రాజా గారి తోటలోని బీసీ స్టడీ సర్కిల్ కు పంపాలని సూచించారు వివరాలు కోసం 0863- 2358071 నంబర్ లో సంప్రదించాలని సూచించారు.

యార్డు మాజీ సెక్రటరీపై అభియోగాల నమోదు

వాటిపై విచారణ జరపాలని ప్రభుత్వ నిర్ణయం ● ఆంధ్రజ్యోతి కథనాన్ని ప్రస్తావించిన వ్యవసాయ సహకార శాఖ



గుంటూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డు(గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ) మాజీ సెక్రెటరీ వీ ఆంజనేయులుపై విచారణ జరపాలని రాష్ట్ర వ్యవసాయ సహకార శాఖ నిర్ణయించింది. మంత్రి కే అచ్చెన్నాయుడు మార్కెటింగ్ శాఖ అధికారులకు రాసిన లేఖ విషయంలో గోప్యత పాటించకుండా దానిని హైకోర్టులో దాఖలు చేసిన రిట్ పిటీషన్‌లో జత చేయడమే ఇందుకు కారణం. ఇదే విషయాన్ని ఆంధ్రజ్యోతి ఈ ఏడాది జనవరి 21వ తేదీన 'మంత్రి లేఖ బట్ట బయలు' అనే శీర్షికతో కథనాన్ని ప్రచురించింది. వ్యవసాయ శాఖ ఎక్స్ అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రెటరీ బుడితి రాజశేఖర్ గురువారం జారీ చేసిన ఉత్తర్వులు జీవో ఆర్ టీ నంబరు. 189లో ఆంధ్రజ్యోతి కథనాన్ని ఉటంకిస్తూ విచారణకు ఆదేశించారు.

మూడు నెలల పాటు మిర్చియార్డుకు ఇన్‌ఛార్జ్ సెక్రెటరీగా వీ ఆంజనేయులు వ్యవహరించారు. రాజమహేంద్రవరం ఏఎంసీ కార్యదర్శిగా ఉన్న ఆయన్ని ఇన్‌ఛార్జ్ ఏర్పాట్లపై గుంటూరు మిర్చియార్డుకు నియమించింది. అయితే ఆయన ఛార్జ్ తీసుకొన్న నెలన్నర వ్యవధిలోనే మరో అధికారిని పోస్టింగ్ చేసేందుకు మార్కెటింగ్ శాఖలో ఫైలు నడిచింది. ప్రస్తుత కార్యదర్శి ఏ చంద్రిక డిప్యూటేషన్ కోసం దరఖాస్తు చేసుకోగా అందుకు మంత్రి సమ్మతిస్తూ మార్కెటింగ్ శాఖకు పంపించారు. దీనికి సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలను మార్కెటింగ్ శాఖ నుంచి సేకరించిన అప్పటి ఇన్‌ఛార్జ్ సెక్రెటరీ ఆంజనేయులు హైకోర్టులో రిట్ పిటీషన్ దాఖలు చేశారు. దాంతో పాటు మంత్రి లేఖని కూడా జోడించారు. ఈ విషయం బహిర్గతం కావడంతో ఆంధ్రజ్యోతి కథనాన్ని ప్రచురించింది.

అధికారిక ఉత్తర్వుల విషయంలో గోప్యత పాటించకపోవడంతో ఆంజనేయులుపై ప్రభుత్వం అభియోగాలను నమోదు చేసింది. వాటిపై విచారణ నిర్వహించేందుకు నిర్ణయం తీసుకొన్నది. ఈ నేపథ్యంలో ఆయనపై నమోదు చేసిన అభియోగాలకు సంబంధించి 15 రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించింది. లిఖిత పూర్వకంగా వివరణ ఇవ్వకపోతే చర్యలు తప్పవని హెచ్చరించింది. అలానే ఎంక్వయిరీ అధికారులపై ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు తీసుకురాకూడదని స్పష్టం చేసింది.

అంతర్ రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

36 ద్విచక్ర వాహనాలు స్వాధీనం... అభినందించిన ఎస్పీ తుషార్ డూడీ



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

భట్టిప్రోలు (కొల్లూరు), ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనాలు చోరీ చేస్తున్న ముఠాను అరెస్టు చేసినట్లు బాపట్ల డీఎస్పీ అవుల శ్రీనివాసరావు తెలిపారు. గురువారం భట్టిప్రోలు పోలీసు స్టేషన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొంత కాలంగా బాపట్ల, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు తదితర జిల్లాలతో పాటు తెలంగాణాలో కూడా ద్విచక్ర వాహనాలను చోరీకి పాల్పడుతున్న ముగ్గురు నేరస్తులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వీరిలో ప్రధాన ముద్దాయి తెనాలికి చెందిన పుట్టా శివశంకర్ ఆటోలు నడుపుకుని జీవనం సాగించేవాడని, చెడు వ్యసనాలకు బానిసై దొంగతనాలకు అలవాటు పడి రైల్వే స్టేషన్, బస్టాండ్, సినిమా హాలు వద్ద పార్కు చేసిన ద్విచక్ర వాహనాలను నకిలీ తాళాలతో చోరీకి పాల్పడుతుంటాడన్నారు. అతనికి కోడి పందాల వద్ద చెరుకుపల్లి మండలం కనగాలకు చెందిన పీటా నాగబాబు, ఐలవరంకు చెందిన దీపాల తేజ్‌వెంకటనాగసాయి విజయ్‌కుమార్ పరిచయమయ్యారన్నారు. శివశంకర్ పలు చోట్ల చోరీ చేసిన ద్విచక్ర వాహనాలను వీరి వద్ద భద్రపరుస్తూ ఉంటాడన్నారు. శివశంకర్‌పై వివిధ పోలీస్ స్టేషన్‌లలో దొంగతనం కేసులు నమోదు అయి వున్నాయన్నారు. నాగబాబుపై చెరుకుపల్లి పోలీస్ స్టేషన్‌ఓ చీటింగ్ కేసు ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు. భట్టిప్రోలులోని హోసన్న మందిరం వద్ద ఓ గృహంలో ఉన్న మోటారు సైకిల్ చోరీ జరిగింది. బాధితుడు ఫిర్యాదు మేరకు, ఎస్పీ ఆదేశాలతో, డీఎస్పీ ఆధ్వర్యంలో వేమూరు సీఐ పసుపులేటి వీరాంజనేయులు, రేపల్లె రూరల్ సీఐ సురేష్‌బాబు సారధ్యంలో భట్టిప్రోలు, చెరుకుపల్లి ఎస్ఐలు శివయ్య, అనీల్‌కుమార్ ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయడంతో పాటు సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి అంతర్ రాష్ట్ర దొంగల ముఠాను అత్యంత చాకచాక్యంగా అరెస్టు చేసి వారి వద్ద రూ.25లక్షలు విలువ కలిగిన 36 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. అంతర్ రాష్ట్ర దొంగల ముఠాను అరెస్టు చేసిన డీఎస్పీ శ్రీనివాసరావుతో పాటు వేమూరు, రేపల్లె రూరల్ సీఐలను భట్టిప్రోలు, చెరుకుపల్లి ఎస్ఐలు, సిబ్బందిని ఎస్పీ తూషార్‌డూడీ ప్రత్యేకంగా అభినందించారని ఆయన వివరించారు.

తృణధాన్యాల ఉత్పత్తులలోకి తెనాలి డబుల్ హార్స్ గ్రూప్



తృణధాన్యాల ఉత్పత్తుల ఆవిష్కరణలో డబుల్ హార్స్ ఎండీ శ్యాంప్రసాద్, డాక్టర్ సంగీతారెడ్డి, యాంకర్ సుమ, నిర్మాత దిల్‌రాజు తదితరులు

తెనాలి అర్బన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : పప్పుల విక్రయంలో ప్రముఖ స్థానం పొందిన డబుల్ హార్స్ సంస్థ తాజాగ తృణ ధాన్యాల ఉత్పత్తులలోకి ప్రవేశించిందని సంస్థ ఎండీ మునగాల శ్యాంప్రసాద్ తెలిపారు. మిల్లెట్ మార్వెల్స్ పేరుతో తయారు చేసిన ఉత్పత్తులను గురువారం హైదరాబాద్‌లో అపోలో హాస్పటల్ జేఎండీ డాక్టర్ సంగీతారెడ్డి చేతుల మీదుగా మార్కెట్‌లోకి విడుదల చేసినట్లు తెలిపారు.

హెల్త్ మిక్స్ డయాబెటిక్ ఫ్రెండ్లీ మిక్స్, సెమోలినా, పాస్తా, నట్స్, డ్రైడ్ ఫ్రూట్స్ వంటి ఉత్పత్తులను క్రమంగా తెనాలి డబుల్ హార్స్ మార్కెట్‌లోకి తెస్తుందని శ్యాంప్రసాద్ చెప్పారు. ఆర్గానిక్ ఉత్పత్తులను కూడా రానున్న రోజుల్లో విడుదల చేసేందుకు సిద్ధం అవుతున్నామని, తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర దేశాలకు కూడా మిల్లెట్ మార్వెల్స్ అందిస్తామన్నారు. ఆ తరువాత పాన్ ఇండియా మార్కెట్‌లో విస్తరిస్తామని రానున్న మూడేళ్లలో ఐదు శాతం ఆదాయం మిల్లెట్ మార్వెల్స్ ద్వారా సమకూరేందుకు లక్ష్యం పెట్టుకున్నామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో సంస్థ సేల్స్ టర్నోవర్ రూ.535కోట్లకు చేరిందని రానున్న మూడేళ్లలో దీనిని నాలుగు అంకెలకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 12 దేశాలలో తమ బ్రాండెడ్ కమోడీటీస్ అడుగు పెట్టాయని, దేశంలోని 15 రాష్ట్రాలలో ఖాతాదారులకు చేరువ అయ్యామన్నారు. జనరల్ ట్రేడ్, మోడ్రన్ ట్రేడ్, ఈ-కామర్స్, క్విక్ కామర్స్ ద్వారా వినియోగదారులకు ఉత్పత్తులు అందిస్తున్నామన్నారు. బ్రాండెడ్ అవుట్‌లెట్లు ఏర్పాటు చేస్తూ వినియోగదారులకు చేరువ అవుతామని చెప్పారు. కార్యక్రమంలో యాంకర్ సుమ, నిర్మాత దిల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

కొడుకుని రక్షించబోయి.. తండ్రి మృతి

మాచవరం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : కళ్ళెదుటే తన కుమారుడు నీటి కుంటలో మునిగి పోతూ ఉంటే ఏ తండ్రి అయినా చూస్తూ ఊరుకుంటాడా?...తన ప్రాణాలను సైతం లెక్క చేయకుండా కొడుకుని రక్షించి చివరకు తన ప్రాణాలను తీసుకున్న విషాద సంఘటన మండలంలోని శ్రీ రుక్మిణీపురం గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మేకలను మేపుకొనేందుకు దేశబోయిన వెంకటేశ్వర్లు(40) అతని కుమారుడు మణికంఠ, మేనల్లుడు వెంకటేశ్వర్లు ముగ్గురు కలసి వెళ్ళారు. పగలంతా మేకలను మేపుకొని తిరిగి ఇంటికి వస్తున్న తరుణంలో మేకలకు నీరు తాగించేందుకు కృష్ణా నది ఒడ్డు సమీపంలోకి వెళ్ళారు. శ్రీ రుక్మిణీపురం, నాగేశ్వరపురం తండా గ్రామాల సమీపంలో ఉన్న పిల్లేరు వాగు కృష్ణా నదిలో కలిసే ప్రాంతంలో మేకలకు నీరు తాగించేందుకు పూనుకున్నారు.

ఆ సమయంలో మేకలు నీటిలో కొట్టుకు పోతాయనే ఉద్దేశంతో ముందుగా వెంకటేశ్వర్లు కుమారుడు మణికంఠ నీటిలోకి దిగాడు. అదే సమయంలో కింద పూడు ఉండటంతో మునిగి పోతున్నాడు. ఇది గమనించిన తండ్రి వెంకటేశ్వర్లు కొడుకును రక్షించేందుకు తాను నీటిలోకి దిగి కొడుకును పైకి లాగి తాను పూడిలో కూరుకు పోతున్నాడు. ఇది గమనించిన మేనల్లుడు వెంకటేశ్వర్లు మేనమామను రక్షించేందుకు తన ఒంటి మీద ఉన్న లుంగీని తీసివేసి వెంకటేశ్వర్లుకు అందించే ప్రయత్నం చేసినప్పటికీ ఉపయోగం లేకుండా పోయింది. వెంకటేశ్వర్లు పూడిలో కూరుకు పోయి చనిపోయాడు. ఇరుగురు పొరుగు వారి ద్వారా సమాచారాన్ని బంధువులకు చేర వేశారు. బంధువులు మాచవరం పోలీసులకు సమాచారాన్ని ఇవ్వగా సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మత్స్యకారుల ద్వారా మృత దేహాన్ని వెలికి తీశారు. వెంకటేశ్వర్లు తల్లి నాగమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల వైద్యశాలకు తరలించారు.

ఆర్మీలో ఉద్యోగాలకు రిజిస్ట్రేషన్ తేదీ పొడిగింపు

● ఈ నెల 25వ తేదీ వరకు అవకాశం

గుంటూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): భారత సైన్యంలో నియామకాలకు రిజిస్ట్రేషన్ గడవు తేదీని పొడిగించినట్లు ఆ సంస్థ గుంటూరు బ్రాంచ్ రిక్రూటింగ్ కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నెల 25వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొనేందుకు అవకాశం ఉన్నదని పేర్కొన్నది. ఆన్‌లైన్ కామన్ ఎంట్రన్స్ ఎగ్జామ్ జూన్ నెలలో తెలుగుతో సహా 13 వేర్వేరు భాషలలో నిర్వహించడం జరుగుతుంది. గుంటూరు, కర్నూలు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, అనంతపురం, వైఎస్ఆర్ కడప, ప్రకాశం, చిత్తూరు, బాపట్ల, పల్నాడు, నంద్యాల, తిరుపతి, అన్నమయ్య, శ్రీ సత్యసాయి జిల్లాలకు చెందిన ఆసక్తిగల అభ్యర్థులు అగ్నివీర్ జనరల్ డ్యూటీ, టెక్నికల్ అసిస్టెంట్, క్లర్కు/స్టోర్‌కీపర్ టెక్నికల్, ట్రేడ్స్‌మెన్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలియపరిచింది. నియామక ప్రక్రియ పూర్తిగా ఆటోమేటెడ్, న్యాయపరంగా, పారదర్శకంగా ఉంటుందని తెలిపింది. అభ్యర్థులు ఎవ్వరూ దళారీలు, ఏజంట్లు, ఏజెన్సీల ప్రలోభాలకు గురికావొద్దని సూచించింది.

జూన్ నెలాఖరు వరకు తిరుపతి, షిర్డి ప్రత్యేక రైళ్లు

గుంటూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల్లో తిరుపతి, షిర్డి సందర్శనకు వెళ్లే యాత్రీకుల సౌకర్యార్థం దక్షిణ మధ్య రైల్వే జూన్ నెలాఖరు వరకు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు ఆ సంస్థ సీపీఆర్‌వో ఏ శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

నంబరు 07637 తిరుపతి - సాయినగర్ షిర్డి ప్రత్యేక రైలు ఈ నెల 13 నుంచి జూన్ 29వ తేదీ వరకు ప్రతీ ఆదివారం బయలుదేరి చీరాల, బాపట్ల, తెనాలి, గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి మీదగా మరుసటి రోజు సాయినగర్ షిర్డి చేరుకొంటుంది. నంబరు. 07638 సాయినగర్ షిర్డి - తిరుపతి ప్రత్యేక రైలు ఈ నెల 14 నుంచి జూన్ 30వ తేదీ వరకు ప్రతీ సోమవారం బయలుదేరి మంగళవారం తిరుపతికి చేరుకొంటుంది.

చర్లపల్లి - శ్రీకాకుళం రోడ్డు - చర్లపల్లి ప్రత్యేక రైళ్లు

నంబరు. 07025 చర్లపల్లి - శ్రీకాకుళం రోడ్డు ప్రత్యేక రైలు ఈ నెల 11 నుంచి జూన్ 27వ తేదీ వరకు ప్రతీ శుక్రవారం బయలుదేరి నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు మీదగా మరుసటి రోజు శ్రీకాకుళం రోడ్డుకు చేరుకొంటుంది. నంబరు. 07026 శ్రీకాకుళం రోడ్డు - చర్లపల్లి ప్రత్యేక రైలు ఈ నెల 12 నుంచి జూన్ 28వ తేదీ వరకు ప్రతీ శనివారం బయలుదేరి మరుసటి రోజు చర్లపల్లి చేరుకొంటుందన్నారు.

గురజాల డీఎస్పీ జగదీష్ వీఆర్‌కు బదిలీ

గురజాలటౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): గురజాల డీఎస్పీ జగదీష్ వీఆర్‌కు గురువారం బదిలీ అయ్యారు. ఆయన్ను ఐజీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. కాగా సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు ఇన్‌ఛార్జిగా వ్యవహరించనున్నారు.

వైసీపీ నాయకుల్లో తగ్గని అహంకారం

మాజీ ఎంపీ గోరంట్ల వ్యవహారంపై ఎమ్మెల్యే నరేంద్ర

పొన్నూరు టౌన్ ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): చేసిన అరాచక పాలన దుర్మార్గ నిర్ణయాలకు అధికారం కోల్పోయిన వైసీపీ నాయకులలో అహకారం మాత్రం తగ్గలేదని ఎమ్మెల్యే , సంగం డెయి రీ ఛైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ గురువారం అన్నారు. మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ వ్యవహారమే వైసీపీ నాయకుల అహంకార వైఖరికి నిదర్శనమన్నారు. చేబ్రోలు కిరణ్ అనే సోషల్ మీడియా కార్యకర్త అరెస్టు వ్యవహారంలో గోరంట్ల మాధవ్ పోలీసుల సమాచారంతోనే సంఘటన స్థలానికి చేరుకుని దాడికి పాల్పడ్డాడని అనుమానం వ్యక్తం చేశారు. పోలీసులలో ఉన్న వైసీపీ సానుభూతి పరుల సమాచారంతోనే గోరంట్ల మాధవ్ కిరణ్‌ను తరలిస్తున్న వాహనాలను అనుసరిస్తూ వస్తూ పోలీసుల సమక్షంలోనే దాడి చేసే దుస్సాహసానికి పాల్పడ్డాడని ఎమ్మెల్యే ఆరోపించారు. చేబ్రోలు కిరణ్ వైసీపీ నాయకుల కుటుంబ సభ్యుల పై అనుచిత వ్యాఖ్యలు చేశారని కూటమి ప్రభుత్వమే ముందుగా స్పందించి చట్ట పరంగా కిరణ్‌ను శిక్షించేందుకు అరెస్టు చేసి చిత్తశుద్ధిని నిరూపించుకుందన్నారు. మాధవ్ వ్యవహారం పై పోలీసుల సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. లేదంటే కస్టడీలో ఉన్న కిరణ్ పై జరిగిన దాడి పోలీసుల వైఫల్యమే అవుతుందన్నారు.

రేపటి నుంచి కొండవీటి కళాపరిషత్ నాటికల పోటీలు

యడ్లపాడు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి) : రెండున్నర దశాబ్దాలకు పైగా నాటిక పోటీలు నిర్వహిస్తున్న కొండవీడు కళాపరిషత్. ఈ నెల 12 నుంచి మూడు రోజులపాటు 26వ జాతీయ స్థాయి ఆహ్వాన నాటిక పోటీలను నిర్వహిస్తున్నారు. పల్నాడు జిల్లా లింగారావుపాలెం గ్రామంలో గల జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలోని పోసాని సుబ్బారావుచౌదరి స్మారక కళావేదిక పై 12,13,14 తేదీలలో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు మూడు నాటికల చొప్పున మొత్తం 9 నాటికలు ప్రదర్శితం కానున్నాయి. ఆయా పోటీల్లో ఉత్తమంగా నిలిచిన ప్రథమ, ద్వితీయ, తృతీయ ప్రదర్శనలకు నగదు బహుమతులు, కళాకారులకు జ్ఞాపికలు, ప్రతి నాటికకు ప్రదర్శన పారితోషికం ఇస్తున్నామని వివరించారు. అలాగే ఉత్తమ రచయిత, ఉత్తమ దర్శకుడికి ప్రత్యేక నగదు బహుమతులు, షీల్డులు ఇవ్వనున్నట్లు పరిషత్ అధ్యక్షులు కట్టా శ్రీహరిరావు, కార్యదర్శి మండెపూడి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు తోకల సాంబశివరావు, సభ్యులు తెలిపారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం గురువారం నాటికి 515.30 అడుగులు ఉంది. ఇది 140.84 టీఎంసీలకు సమానం. ఎడమ కాలువ ద్వారా 841 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 2441 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

1,22,136 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 1,25,167 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,22,136 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 65,764 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9500	13200
నంబరు. 5	10000	13300
273	10000	12600
341	10500	13600
4884	10000	11500
సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	13500

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
షార్క్-1	10000	12400
బ్యాడిగి 355	10000	13200
సింజెంటా బ్యాడిగి 5531	--	--
దేవనూరు డీలక్స్	10000	12400
ఆర్మూరు	9800	11000
తాలుకాయలు	4500	6500

సబ్ జైలును తనిఖీ చేసిన న్యాయమూర్తి



సబ్ జైలును తనిఖీ చేస్తున్న న్యాయమూర్తి

సత్తెనపల్లి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సబ్ జైలును జిల్లా న్యాయసేవాధికార కమిటీ కార్యదర్శి సివిల్ జడ్జి జియాఉద్దీన్ గురువారం తనిఖీచేశారు. నిందితులతో మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వారికి అందిస్తున్న ఆహార పదార్థాలను పరిశీలించారు. ఉచిత న్యాయ సహాయం అందిస్తామన్నారు. అనంతరం పట్టణంలోని ఏపీటీ అనాథ పిల్లల వసతిగృహాన్ని, సత్తెనపల్లి మండలంలోని ధూళ్ళిపాళ్ళలో ఉన్న హౌస్ ఆఫ్ అనియన్స్ అనాథ పిల్లల ఆశ్రమాన్ని తనిఖీచేసి రికార్డులను పరిశీలించారు. ఆయనతో పాటు న్యాయవాది బీఎల్ కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.



- సత్తెనపల్లి

ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ గురువారం గుంటూరులోని ఆయన గృహంలో కలిశారు. సత్తెనపల్లి నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.

ఎమ్మెల్యే కన్నాకు సన్మానం

సత్తెనపల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 21వ వార్డు భావనరుషినగర్‌లో ఉన్న శ్రీప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో గురువారం శ్రీరామనవమి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే పాల్గొని భక్తులకు అన్నదానం చేశారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకులు ఎలినేడి రామస్వామి, నాయకులు మారెళ్ళ మల్లేశ్వరరావు, పోట్ల ఆంజనేయులు, నూర్ బాషా జాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

13న గురుకుల ప్రవేశ పరీక్ష

సత్తెనపల్లి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఏపీ సాంఘిక సంక్షేమ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయాల్లో 2025-26 సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాల కొరకు ఈనెల 13వ తేదీ సత్తెనపల్లి మండలం రామకృష్ణాపురం బాలుర గురుకుల పాఠశాలలో ప్రవేశ పరీక్ష జరుగుతుందని ప్రిన్సిపల్ జాన్సన్ గురువారం విలేకరులకు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 12వరకు 5వ తరగతి విద్యార్థులకు, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్నం 2గంటల నుంచి 4:30వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు. దరఖాస్తుదారులు హాల్‌టిక్కెట్‌లను వెబ్‌సైట్ నుంచి పొందవచ్చనితెలిపారు. ఏదైనా గుర్తింపుకార్డుతో పరీక్షకు హాజరు కావాలన్నారు.

21న దేచవరం మోడల్ స్కూల్‌లో ప్రవేశ పరీక్ష

నకరికల్లు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఈనెల 21వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12వరకు దేచవరం మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ కే వెళాంగిని మేరి తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు హాల్ టిక్కెట్స్‌ను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

● దాచేపల్లి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మోడల్ స్కూల్ 6వ తరగతి ప్రవేశపరీక్ష తేదీ మారినట్టు దాచేపల్లి మండల మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ రవికుమార్ గురువారం తెలిపారు. తొలుత ఈ నెల 20న ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్టు ప్రకటించామన్నారు. ఈనెల 21న ఉదయం 10గంటల నుంచి 12 వరకు ఈ పరీక్ష జరుగుతుందని వివరించారు.

● రెంటచింతల: మోడల్ స్కూల్ ఆధ్వర్యంలో 6వ తరగతిలో ప్రవేశానికి నిర్వహించే ఎంట్రెన్స్ పరీక్షను ఈనెల 21వ తేదీన నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ కె.పాపయ్య చెప్పారు.

● క్రోసూరు: క్రోసూరులోని ప్రభుత్వ మోడల్ స్కూల్ 6వ తరగతి ప్రవేశపరీక్ష ఈనెల 21వ తేదీన జరుగుతుందని ప్రిన్సిపాల్ మేరీసుజన్ గురువారం తెలిపారు.

గుండెపోటు నుంచి రక్షించిన సీహెచ్‌సీ వైద్యులు



గుండెపోటు వ్యక్తికి వైద్యం చేస్తున్న డాక్టర్లు

పెదకూరపాడు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): గుండెపోటు వచ్చిన వ్యక్తికి వైద్యసేవలు అందించి కాపాడిన సంఘటన పెదకూరపాడులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో జరిగింది. మండలంలోని జలాలపురం గ్రామానికి చెందిన పువ్వాడ సాంబశివరావుకు తీవ్రమైన ఛాతినొప్పి రావటంతో భార్య దాత్రీదేవి, కుటుంబసభ్యులు పెదకూరపాడులో సీహెచ్‌సీకి తెచ్చారు. విధుల్లో ఉన్న మత్తువైద్యులు డాక్టర్ వెంకటేశ్వర్లు, సాంబశివరావును పరీక్షించి గుండెపోటుగా నిర్ధారించి రూ.40వేల విలువైన టెనెక్ట్ ప్లేస్ ఇంజక్షన్ ఇచ్చి కాపాడారు. గురువారం సాంబశివరావు భార్యతో వచ్చి డాక్టర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

అంబేద్కర్ జాతీయ ప్రతిభా అవార్డుకు ప్రసాదరావు ఎంపిక

పెదకూరపాడు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పెదకూరపాడు ఎంఈవో ఏకుల ప్రసాదరావు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జాతీయ ప్రతిభా అవార్డుకు ఎంపికైనట్లు చదరన్ ప్రవేశ్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు డాక్టర్ సీ నాగయ్య గురువారం తెలిపారు. 15 ఏళ్లపాటు హైస్కూలు ఉపాధ్యాయుడిగా, 16 ఏళ్లుగా జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎంగా, ఎంఈవోగా బాధ్యతలు నిర్వహిస్తున్న ప్రసాదరావు ఈనెల 13వ తేదీన గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో అవార్డును అందుకోనున్నట్టు తెలిపారు.

రోగులకు వైద్య పరీక్షలు

అచ్చంపేట, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): అచ్చంపేటలోని పీఏసీఎస్ కార్యాలయం వద్ద 250 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అంతర్జాతీయ సహకార సంఘంలో భాగంగా అచ్చంపేట సహకార సంఘం, ఎల్‌వీ ప్రసాదు కంటివైద్య ఆస్పత్రి సంయుక్తం ఆధ్వర్యంలో 250మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఉచితంగా కంటి పరీక్షలుచేసి అవసరమైన వారికి కళ్ళజోళ్ళు అందించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ ఇన్నారావు, వెంకటరావు, ఎల్‌వీ ప్రసాదు కంటి ఆస్పత్రి డాక్టర్ ఎం మల్లేష్, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో గడ్డివామి దగ్ధం

అమరావతి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): అమరావతిలో పెద్దిబోయిన బుల్లియ్యకు చెందిన వరిగడ్డి వామి అగ్నికి బూడిదైంది. గురువారం మధ్యాహ్నం 10 ట్రక్కుల గడ్డివామి అగ్నిప్రమాదంలో పూర్తిగా దగ్ధమైంది. క్రోసూరు నుండి ఫైర్‌ఇంజన్ వచ్చి మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చింది. సుమారు రూ2.5లక్షల నష్టం వాటిల్లినట్లు బుల్లియ్య తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మాచర్ల రూరల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చెన్నకేశవస్వామి, కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయాల ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాల మార్పు పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ కోటేశ్వరరావు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.



నాగిరెడ్డిపాలెం-చౌటపాపాయపాలెం రోడ్డులో చప్టాకు ఇరువైపులా ఇనుప రాడ్లు లేని దృశ్యం



నందిరాజుపాలెం వెళ్ళే రహదారిలో శిథిలావస్థకు చేరిన చప్టా



బెల్లంకొండ-క్రోసూరు రహదారిలో శిథిలావస్థకు చేరిన వంతెన

శిథిలావస్థలో వంతెనలు

● పట్టించుకోని అధికారులు

బెల్లంకొండ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): బెల్లంకొండ మండలంలోని పలు రహదారులపై ఉన్న వంతెనలు శిథిలావస్థకు చేరాయి. బెల్లంకొండ క్రాస్‌రోడ్డు నుంచి క్రోసూరు వెళ్ళే రహదారిలో నాగిరెడ్డిపాలెం గ్రామ సమీపంలో ఉన్న వంతెన శిథిలావస్థకు చేరింది. నాగిరెడ్డిపాలెం నుంచి నందిరాజుపాలెం వెళ్ళే రహదారిలో నాగమ్మ చెరువు వద్ద నిర్మించిన వంతెన శ్లాబు పెచ్చులు ఊడి ఇనుప చువ్వలు బయటపడ్డాయి. కొంత భాగం శ్లాబు కుంగిపోయింది. వంతెన ఇరువైపులా ఉన్న గోడలు దెబ్బతిన్నాయి. ఈ ప్రదేశంలో రాత్రి వేళల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. పలుమార్లు వంతెన పైనుంచి ట్రాక్టర్‌లు కిందపడిన సంఘటనలు కూడా జరిగాయి. అదేవిధంగా బెల్లంకొండ నుంచి రాజుపాలెం మండలం చౌటపాపాయపాలెం గ్రామానికి వెళ్ళే కాలువపై ఉన్న వంతెన రెండు వైపులా గోడలు లేకపోవటంతో ప్రమాదభరితంగా ఉంది. నాగిరెడ్డిపాలెంకు చెందిన గ్రామస్తులు ఆ రహదారిలోనే పొలం పనులకు వెళుతుంటారు. రెండువైపులా గోడలు లేకపోవటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అదేవిధంగా పాపాయపాలెం నుంచి వెంకటాయపాలెం వెళ్ళే రహదారిలో మన్నెసుల్తాన్‌పాలెం వద్ద ఉన్న వంతెన 50 ఏళ్ల క్రితం నిర్మించారు. ఆ వంతెన కూలేందుకు సిద్ధంగా ఉంది. అదేవిధంగా చిన్నపాటి వర్షం కురిసినా వంతెనపై నీరు పొర్లి రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరిన వంతెనల వద్ద కొత్త వంతెనలు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి

ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

బెల్లంకొండ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్య పడుతుందని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. గురువారం మండలంలోని న్యూచిట్యాల ఆర్‌అండ్ఆర్ సెంటర్‌లో పెదకూరపాడు నియోజకవర్గ ఎస్టీసెల్ అధ్యక్షుడు హనుమంతరావు నాయక్ నివాసంలో సమావేశం ఏర్పాటుచేశారు. ఎమ్మెల్యే ప్రవీణ్ మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి దిశలో పయనిస్తుందని, 9నెలల పాలనలోనే అన్ని వర్గాలకు సముచిత న్యాయం చేసిన ఘనత చంద్రబాబునాయుడుదేనన్నారు. మాజీ సీఎం జగన్‌రెడ్డి పోలీసులపై అసభ్యకరంగా మాట్లాడటం మంచి పద్ధతి కాదన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పోలీసులను అడ్డుపెట్టుకొని పరదాలచాటున తిరిగిన ఆయన పోలీసులను విమర్శిస్తుంటే హాస్యాస్పదంగా ఉందన్నారు. నియోజకవర్గంలో తొమ్మిది నెలల్లో అన్ని గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు.

ప్రజల సమస్యల పరిష్కారానికే ప్రజ దర్బార్

ప్రజల సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ఏర్పాటుచేసినట్టు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని న్యూచిట్యాల ఆర్‌అండ్ఆర్ సెంటర్ పార్టీ కార్యాలయంలో ప్రజాదర్బార్ ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో మండలస్థాయి అధికారులు హాజరయ్యారు. కార్యక్రమంలో 115 అర్జీలు వచ్చినట్టు తెలిపారు. అర్జీలను మండలస్థాయి అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధానకార్యదర్శి మస్తాన్‌షరీఫ్, మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, మండల కోర్ కమిటీ సభ్యుడు వెన్నా సీతారామిరెడ్డి, తెలుగు మహిళా అధ్యక్షురాలు నాగమణి బాయి, టీడీపీ నాయకులు అక్కల వెంకటరామిరెడ్డి, గుడిసె కొండయ్య, మండల ఇన్‌చార్జ్ శ్రీనివాసరావు, పీఎస్‌కే రసూల్, సయ్యద్ జానీ, ఎన్ పిచ్చయ్య, ఓర్సు ఆనంద్, హనుమంతరావునాయక్, శ్రీనివాసరావు, మేకం శ్రీరామమూర్తి, ఓర్సు రాంబాబు, సర్పంచ్ జ్యోతి సముద్రం, ఎంపీడీవో హనిమిరెడ్డి, తహసీల్దార్ మున్నీసాబేగం, ఏవో కృష్ణయ్య, దేవదాయశాఖ అధికారి వెంకటేశ్వరరెడ్డి, ఎంఈవో రాజకుమారి, ఎస్ఐ ప్రవీణ్ పాల్గొన్నారు.



బీఎల్‌వోల శిక్షణలో మాటాడుతున్న ఆర్డీవో రమణకాంత్‌రెడ్డి

తప్పులు లేని ఓటర్ల జాబితా తయారీకి కృషి చేయాలి

● ఆర్డీవో జీవీ రమణకాంత్‌రెడ్డి

సత్తెనపల్లి రూరల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): తప్పులు లేని ఓటర్ల జాబితా తయారు చేయుటలో ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆర్డీవో జీవీ రమణకాంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని ధూళిపాళ్ళ వద్ద గల లయోల ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం బీఎల్‌వోలకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమం ఆయన మాట్లాడుతూ బీఎల్‌వోలు తమ విధులు పక్కాగా నిర్వహించాలన్నారు. ఎన్నికల నిబంధనలకు లోబడి ప్రతి ఒక్క బీఎల్‌వో పని చేయాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని తహసీల్దార్లు, భూత్‌స్థాయి అధికారులు, ఎన్నికలసిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్‌తో పర్యావరణం.. పారిశుద్ధ్యం మెరుగు

నకరికల్లు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమాల ద్వారా గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపడుతోందని, పర్యావరణం బాగుంటుందని బాపట్ల వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ నాన్సీ జాస్మిన్ తెలిపారు. గురువారం మండలంలోని కండ్లకుంట గ్రామంలో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ జీ విజయకుమార్, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం వీ శ్రీనివాసరావు, రావెల లింగయ్య, శ్రీనివాసులు, రావెల సురేష్, గంగినేని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా కల్యాణోత్సవం

సత్తెనపల్లి రూరల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని బృగుబండ గ్రామంలో ఉన్న శ్రీశుభద్ర బలరామ సమేత శ్రీజగన్నాథస్వామి కల్యాణ, తిరునాళ్ళ మహోత్సవం గురువారం కన్నుల పండువగా జరిగింది. మహోత్సవం సందర్భంగా ఆలయంలో వేకువజామునుంచే ప్రత్యేకపూజలు, అభిషేకాలు నిర్వహించారు. రాత్రి 8 గంటల నుంచి అన్నదానాన్ని చేపట్టారు. రెండు భారీ విద్యుత్ ప్రభలను ఏర్పాటుచేశారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు.

రాజకీయ పార్టీల నేతలతో సమావేశం

సత్తెనపల్లి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి నియోజకవర్గంలోని తహసీల్దార్లు, గుర్తింపుపొందిన రాజకీయపార్టీల ప్రతినిధులతో గురువారం ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. నియోజకవర్గంలో 300 ఫారం-7లను గుర్తించటం జరిగిందని, వారికి ఒకేచోట ఓటుహక్కు కల్పిస్తామని ఆర్డీవో తెలిపారు. ఓటర్లనమోదు, తొలగింపు, సవరణలు, పలు అంశాలపై ఆయన చర్చించారు. సమావేశంలో తహసీల్దార్లు చక్రవర్తి, భవానీశంకర్ ఉన్నారు.

పరామర్శ

టీడీపీ నేత, మాజీ కౌన్సిలర్ బలిజేపల్లి సురేష్‌కుమార్ కుమార్తె సాహితిసంజన ఇటీవల మృతిచెందటంతో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ గురువారం ఆయన గృహానికి వెళ్ళి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట టీడీపీ నేతలు ఉన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

సత్తెనపల్లి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ప్రయాణీకుల సమస్యల పరిష్కారానికి సలహాలు, సూచనలు అందించేందుకు ఈనెల 11న డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు డిపో మేనేజర్ విజయకుమార్ గురువారం విలేకరులకు తెలిపారు. ఉదయం 11గంటల నుంచి 12వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. సత్తెనపల్లి డిపో పరిధిలోని ప్రయాణీకులు సమస్యలు, సూచనలను 99592 25429కు తెలపాలన్నారు.

● పిడుగురాళ్ల, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ డిపోలో శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ బీ కోటేశ్వరనాయక్ తెలిపారు. ఉదయం 11 నుంచి గంటపాటు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రయాణికులు సెల్: 99592 25430కు ఫోన్ చేసి సలహాలు, ఫిర్యాదులు అందించవచ్చన్నారు. ప్రయాణికులు, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

స్వర్ణాంధ్ర ఆశయ సాధనలో భాగస్వాములు కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీ అర్జునరావు

సత్తెనపల్లి రూరల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర ఆశయ సాధనలో అధికారులు, ప్రజలు భాగస్వాములు కావాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బీ అర్జునరావు అన్నారు. మండలంలోని నందిగామ వద్ద ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా క్లాప్ మిత్రలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్లాప్‌మిత్రలు పారిశుధ్యం పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాలు పూర్తిస్థాయిలో పనిచేయాలని ఆదేశించారు. పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణపై పలు సూచనలు చేశారు. తడి, పొడిచెత్తల సేకరణ, వర్మికంపోస్టు తయారీ విధానంపై వారికి అవగాహన కల్పించారు. సత్తెనపల్లి, రాజుపాలెం, నకరికల్లు, అచ్చంపేట, అమరావతి, క్రోసూరు, బెల్లంకొండ మండలాల స్వచ్ఛభారత్ మండల కో-ఆర్డినేటర్లతో సమావేశమై స్వచ్ఛాంధ్ర కార్యక్రమ లక్ష్యాలను చేరుకోవటంలో వీరు చేస్తున్న పనుల గురించి ఆరా తీశారు. ముందుగా ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రం పని తీరును పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ బలిజేపల్లి రమాదేవి, ఐటీసీ రిసోర్స్‌పర్సన్ బొల్లయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భావన, ఈవోపీఆర్‌డీ ఏ శ్రీనివాసరెడ్డి, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో పీవీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామంలో మట్టి టిప్పర్లు నడపొద్దు

● మండాది గ్రామస్తులు



మండాదిలో టిప్పర్లను అడ్డుకుంటున్న గ్రామస్తులు

వెల్దుర్తి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): తమ గ్రామం నడిబొడ్డు నుంచి టిప్పర్లు నడపవద్దని ప్రజలకు అసౌకర్యంగా ఉందని మండాది గ్రామస్తులు గురువారం గ్రామంలో టిప్పర్లను నిలిపివేశారు. ఇరుకు బజార్ల కారణంగా రాత్రివేళల్లో నిద్రాభంగం కావడంతోపాటు వృద్ధులు, చిన్నారులకు ఇబ్బంది కలుగుతోందన్నారు. కొద్దిసేపు టిప్పర్లను అడ్డుకున్నారు. గ్రామస్తులతో టిప్పర్ల యజమానులు చర్చలు జరిపి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తామని హామీనివ్వడంతో గ్రామస్తులు టిప్పర్లను వదిలివేశారు.

వాహనచోదకుల కళ్ళల్లో ఇసుక

సత్తెనపల్లి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి పట్టణం నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్ళే ఇసుక లారీలు, టిప్పర్ల డ్రైవర్లు వాటి పైభాగాన పట్టలు కప్పకపోవటంతో వాహనాలు వెళ్తున్న సమయంలో ఇసుక రోడ్లపై వెళ్ళే ద్విచక్రవాహనదారుల కళ్ళల్లో పడుతోంది. దీనివల్ల వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధిక లోడుతోపాటు ఇసుకపై పట్టలు కప్పడం వంటి జాగ్రత్తలు తీసుకోకపోవటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం అమరావతి, అచ్చంపేట రీచ్‌ల నుంచి అధిక సంఖ్యలో లారీలు, టిప్పర్ల ద్వారా ఇసుక సత్తెనపల్లి పరిసర ప్రాంతాలకు తరలివెళ్తుంది. దీనిపై సంబంధిత అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

వృద్ధుడిపై కత్తితో దాడి

క్రోసూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని హసానాబాద్‌లో గురువారం వృద్ధుడిపై యువకుడు కత్తితో దాడిచేశాడు. స్థానికంగా జరిగిన చిన్నవివాదం నేపథ్యంలో మాతంగి వెంకటేశ్వర్లు(60)పై అదే గ్రామానికి చెందిన యర్రంశెట్టి గోపాలకృష్ణ కత్తితో దాడిచేసి గాయపరిచినట్టు బాధితుడు క్రోసూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వెంకటేశ్వర్లుకు స్వల్ప గాయాలుకాగా ఆస్పత్రికి తరలించారు. ఫిర్యాదు మేరకు విచారిస్తున్నట్టు సీఐ సురేష్ తెలిపారు.

పోలీసు కస్టడీకి నలుగురు నిందితులు

రెంటచింతల, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలోని తీగలను అపహరించి గురజాల సబ్ జైలులో రిమాండ్ ఖైదీలుగా వున్న నలుగురిని గురువారం ఒక రోజు పోలీసు కస్టడీలోకి తీసుకుని విచారించినట్లు ఎస్ఐ సీహెచ్ నాగార్జున చెప్పారు. మళ్ళీ సబ్‌జైలుకు తరలించామన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో గురువారం 30.45 టీఎంసీల నీటినిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు రాజు తెలిపారు. ఎగువ నుంచి 800 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద 300క్యూసెక్కుల నీరు దిగువకృష్ణకు విడుదలవుతున్నాయి.

నేడు మెగా మెడికల్ క్యాంపు

అచ్చంపేట, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): అచ్చంపేటలో మెగా మెడికల్‌క్యాంపు నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే ప్రవీణ్ కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చలివేంద్రం ప్రారంభం

రెంటచింతల, ఏప్రిల్ 10: రెంటచింతల పరిధిలో దివంగత టీడీపీ సీనియర్ నేత లేళ్ల పేరయ్య స్మారకార్థం ఎస్‌టీయూ ఆధ్వర్యంలో గురువారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఎస్‌బీఐ మేనేజర్ ఆంజనేయులునాయక్, ఎంఈవో 2 శివనాగేశ్వరరావు వీటిని ప్రారంభించారు.

శవ రాజకీయాలు మానుకో జగన్: టీడీపీ నేత యాగంటి

మాచర్లటౌన్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్‌రెడ్డి ఇకనైనా శవ రాజకీయాలు మానుకోవాలని టీడీపీ సీనియర్ నేత, మాచర్ల మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు అన్నారు. గురువారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జగన్ సామాన్య ఎమ్మెల్యే అయినా కూటమి ప్రభుత్వం జెడ్ క్యాటగిరి భద్రత కేటాయించిందన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో కుటుంబకలహాల వల్ల జరిగిన హత్యకు రాజకీయరంగు పులిమి రాజకీయ లబ్ధికోసం అక్కడకు వెళ్లి పోలీసులను దూషించడం హేయమన్నారు. రాప్తాడులో వైసీపీ కార్యకర్తలు పోలీసులపై దాడిచేసి శాంతిభద్రతలకు విఘాతం కల్పించారన్నారు. పోలీసులపై పరుషంగా మాట్లాడటాన్ని యాగంటి ఖండించారు. ఇదే పోలీసు వ్యవస్థను అడ్డుపెట్టుకొని గత ఐదేళ్లలో కక్షసాధింపు చర్యలు చేయలేదా అని ప్రశ్నించారు. ఎన్నికల్లో వైసీపీని 11 సీట్లకే పరిమితం చేసినా ఇంకా సిగ్గు రాలేదన్నారు. ఇప్పటికైనా జగన్ బుద్ధి మార్చుకొని ప్రజా సమస్యల కోసం పోరాటం చేస్తే బాగుంటుందన్నారు. యాగంటి వెంట వంగవరపు కోటేశ్వరరావు, గాజుల ఆంజనేయులు, సంతోష్ మాస్టర్, దుర్గాకుల ప్రసాద్ తదితరులు ఉన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న యాగంటి

పిన్నెల్లి సోదరులను అరెస్ట్ చేయాలి

● తోట చంద్రయ్య కేసులో సీఐడీ దర్యాప్తు వేగవంతం చేయాలి

● ఎమ్మెల్యే జూలకంటి



డీజీపీతో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్లటౌన్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మాచర్ల నియోజకవర్గంలో గత వైసీపీ హయాంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలపై జరిగిన దౌర్జన్యాలు, దాడులపై సమగ్ర పోలీసు విచారణ చేసి నిందితులను అరెస్ట్ చేయాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి గురువారం ఏపీ డీజీపీ హరీష్ కుమార్‌గుప్తాను కలిసి విజ్ఞప్తి చేశారు. టీడీపీ కార్యకర్త తోట చంద్రయ్య హత్య కేసుపై సీఐడీ చేస్తున్న దర్యాప్తును వేగవంతం చేసి త్వరితగతిన నిందితులకు శిక్ష పడేలా చేయాలని కోరారు. అలాగే పిన్నెల్లి సోదరులు గడిచిన ఐదేళ్లలో అనేక సంఘ విద్రోహ చర్యలకు పాల్పడ్డారని, వారిని తక్షణమే అరెస్ట్ చేసి శిక్షించాలని విన్నవించారు. మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిలు కుట్ర పూరితంగా 2022 డిసెంబరు 16వ తేదీన మాచర్లలో గొడవలకు దిగి టీడీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేశారని, అలాగే ఆస్థులను, వాహనాలను, టీడీపీ కార్యాలయాన్ని తగులబెట్టారని డీజీపీ దృష్టికి ఎమ్మెల్యే జూలకంటి తీసుకొచ్చారు. అలాగే ఎన్నికల సమయంలో రెంటాల, పాలువాయిగేటు, కండ్లకుంట, కేపీగూడెం, కారంపూడిలలో పిన్నెల్లి సోదరుల కనుసన్నల్లో జరిగిన అల్లర్ల కేసులపై సమగ్ర దర్యాప్తు చేసి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపీని కోరారు.

బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల పరిశీలన



ప్రత్యేక పూజల్లో కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావు

మాచర్లటౌన్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో శుక్రవారం నుంచి జరగనున్న బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను కలెక్టర్ పి.అరుణ్‌బాబు గురువారం ఎస్పీ కంచి శ్రీనివాసరావుతో కలిసి పరిశీలించారు. ముందుగా చెన్నకేశవస్వామి ఆలయంలో ప్రత్యేకపూజల్లో పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలించి అధికారుల నుంచి వివరాలను సేకరించారు. ఈనెల 17వ రథోత్సవం సందర్భంగా రథాన్ని పరిశీలించారు. వేసవి దృష్ట్యా భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో గురజాల ఆర్డీవో మురళీకృష్ణ, మండల స్పెషలాఫీసర్ గ్రబునాయక్, తహసీల్దార్ బందెల కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు

విద్యుత్‌శాఖ విజిలెన్స్ తనిఖీలు

● రూ.1.66 లక్షలు అపరాధ రుసుం విధింపు

పెదకూరపాడు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖ విజిలెన్స్ అధికారులు సీఆర్‌డీఏ సర్కిల్ పర్యవేక్షణలో మండలంలోని పలు గ్రామాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించి రూ 1.66 లక్షల అపరాధ రుసుం విధించినట్టు ఆ శాఖ అధికారులు డీఈఈలు కే రవికుమార్, ఎం మల్లికార్జునప్రసాదు, కేవీ కోటేశ్వరరావు గురువారం తెలిపారు. మండలంలోని పెదకూరపాడు, కాశిపాడు, బుచ్చయ్యపాలెం, హుస్సేన్‌నగరం, గారపాడు, రామాపురం, పొడపాడు, పరస, పాటిబండ్ల, లగడపాడు గ్రామాల్లో 46మంది అధికారులు, 189మంది సిబ్బంది 46 బృందాలుగా 3,221 సర్వీసులను తనిఖీ చేశారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న వారిని గుర్తించి అపరాధ రుసుం విధించినట్టు వారు తెలిపారు. ఈ దాడుల్లో విద్యుత్ శాఖ ఏఈలు ఏ చంద్రశేఖర్, డీ రామకృష్ణ, కే కోటేశ్వరరావు, ఎం సతీష్ కుమార్, యూ శివశంకర్, డీఈఈ, ఏఈలు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణకు విద్య అవసరం

మాచవరం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): సమాజంలో బాలల హక్కుల పరిరక్షణ కోసం విద్య ఎంతో అవసరమని కార్ఫ్ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ తాళ్ళూరి అమరనాథ్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని పిల్లుట్ల గ్రామంలోని ఎస్సీ కాలనీలో బాల బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కార్ఫ్ సంస్థ జాయింట్ డైరెక్టర్ పుష్పలత, మండల ఏసీవో విజయకుమార్, డీవో మహేష్ తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారమే రీసర్వే లక్ష్యం

దాచేపల్లి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): భూసమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంగా రీసర్వే కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు దాచేపల్లి తహసీల్దార్ వైపీ కుటుంబరావు తెలిపారు. గురువారం దాచేపల్లి మండలంలోని భట్రుపాలెం గ్రామంలో రీసర్వేపై గ్రామసభ నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ శాస్త్రీయ విధానాలను అనుసరించి సర్వే జరుగుతుందని తెలిపారు. సర్వే జరుగుతున్న సమయంలో రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకాలు, ఇతర ముఖ్యపత్రాలను తీసుకొని పంటపొలాల వద్ద అధికారులు సహకరించి రీసర్వేకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ వాహా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్డు శంకుస్థాపన

దాచేపల్లి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి):దాచేపల్లి మండలం పెదగార్లపాడులోని సిమెంట్ రోడ్డు నిర్మాణానికి చెట్టినాడు సిమెంట్ ఫ్యాక్టరీ ఆధ్వర్యంలో భూమి పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. పెదగార్లపాడు నుంచి కరాలపాడు వెళ్ళే రహదారిలో కిలోమీటరు దూరం రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. కార్యక్రమంలో ఫ్యాక్టరీ యాజమాన్యం పాల్గొన్నారు.

ఆంధ్ర ఇవాంజికల్ లూథరన్ సంఘం పశ్చిమ గుంటూరు అధ్యక్షుడిగా ఐజయ్యరాజు

మాచర్లటౌన్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర ఇవాంజికల్ లూథరన్ సంఘం పశ్చిమ గుంటూరు అధ్యక్షుడిగా చాట్ల ఐజయ్యరాజు ఎన్నికయ్యారు. గురువారం పట్టణంలోని క్రీస్తు లూథరన్ సంఘ దేవాలయంలో జరిగిన 88వ వార్షికోత్సవ మహాసభలో ఈ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా ఐజయ్యరాజు మోడరేటర్ బిషప్ చింతల ఏలియా, పాలకవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పశ్చిమ గుంటూరు సినడ్‌కు చెదిన అభిషక్తులు, అనాభిషక్తులు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

ఆటల పోటీల విజేతలకు బహుమతులు

క్రోసూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): క్రోసూరులో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా బాలబాలికలకు బుధ, గురువారాల్లో ఆటలపోటీలు నిర్వహించారు. విజేతలకు రెడ్డి జనసేవా సంఘం అధ్యక్షుడు దారెడ్ల సీతారెడ్డి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సేవా సంఘం నాయకులు పాల్గొన్నారు.

టాటా మ్యాక్సీ ఢీకొని మహిళ మృతి



ఖాదర్‌బి (ఫైల్)

మాచర్లటౌన్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతున్న మహిళను టాటా మ్యాక్సీ వాహనం ఢీకొనడంతో మహిళ మృతిచెందిన సంఘటన మాచర్ల పట్టణంలో జరిగింది. పట్టణంలోని రింగురోడ్డుకు చెందిన షేక్ ఖాదర్‌బి(55) వ్యవసాయ కూలిపనులు చేసుకుంటూ ఒంటరిగా జీవిస్తోంది. గురువారం పొలం పనులకు వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా టాటా మ్యాక్సీ వాహనం ఢీకొనడంతో ఖాదర్‌బి అక్కడికక్కడే మృతిచెందింది. పట్టణ పోలీసులు సంఘటనా ప్రదేశానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. టాటా మ్యాక్సీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంధ్యారాణి తెలిపారు. కాగా మృతురాలు అవివాహితురాలు.



ఉపాధికి ఊతం!



గుంటూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. వారిని సంక్షేమ పథకాల తాత్కాలిక బుజ్జగింపులతో సరిపెట్టకుండా, స్వయం ఉపాధి కల్పన దిశగా నడిపించేందుకు కృషి చేస్తోంది. ఈ నేపథ్యంలోనే దాదాపు ఆరేళ్ల క్రితం ఆగిపోయిన బీసీ ఉపాధి కార్యక్రమాలను ప్రభుత్వం తెరమీదకు తెచ్చింది. ఒక్కొక్కటిగా అమలు చేసుకుంటూ ముందుకు వెళ్లింది

- బడుగు బలహీన వర్గాల స్వయం ఉపాధికి పెద్దపీట
- ఐదేళ్ల తరువాత మళ్లీ కార్పొరేషన్ రుణాల మాట
- 50 శాతం సబ్సిడీతో బీసీలకు భారీగా రుణాలు
- తిరిగి తెరమీదకి ఆదరణ- 3 పథకం పనిముట్ల పంపిణీ
- ఇప్పటికే పెద్ద సంఖ్యలో దరఖాస్తులు

కార్పొరేషన్లలో జోష్..

2014-19కి మధ్య బీసీ కార్పొరేషన్ ద్వారా వివిధ బీసీ కులాలకు చెందిన యువకులు స్వయం ఉపాధి రుణాలు పొందేవారు. 50 శాతం రాయితీతో రూ. 2 లక్షల రుణం తీసుకుని, అందుబాటులో ఉన్న ఏదో ఒక ఉపాధిరంగాన్ని యువత ఎంచుకునేది. అలాంటి కార్పొరేషన్‌ను వైసీపీ ప్రభుత్వం ముక్కచెక్కలు చేసింది. 56 కార్పొరేషన్లుగా విడగొట్టి ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా కార్పొరేషన్ చైర్మన్లను ఉత్సవ విగ్రహాలుగా నిలబెట్టింది. కూర్చోడానికి కుర్చీలు ఇవ్వలేదన్న విమర్శలు అప్పట్లో బలంగా వినిపించాయి. కాగా కూటమి ప్రభుత్వం వచ్చాక పరిస్థితి పూర్తిగా మారిపోయింది. బీసీ కార్పొరేషన్లకు హుటా హుటిన చైర్మన్లను నియమించడమే కాకుండా వాటి ద్వారా ఉపాధి కల్పించేందుకు చర్యలు చేపడుతున్నారు. కార్పొరేషన్ల ద్వారా గరిష్ఠంగా రూ. 8లక్షల వరకూ 50 శాతం సబ్సిడీతో రుణాలు ఇచ్చేందుకు ప్ర భుత్వం చర్యలు తీసుకుంది. తొలివిడతగా ఒక్కో ని యోజకవర్గం నుంచి 15 మందికి ఆ రుణాలు అందిం చనున్నారు. ఇప్పటికే జిల్లాలో దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమయింది. ఇప్పటి వరకూ గుంటూరు జిల్లా లో 13,435, పల్నాడు జిల్లాలో 9,177, బాపట్ల జిల్లా లో 10,128 మంది కార్పొరేషన్ రుణాలకోసం దర ఖాస్తు చేసుకున్నారు.

జిల్లాలో ఆదరణ-3 పైలట్ ప్రాజెక్టు

ప్రభుత్వం ఆదరణ- 3 పథకాన్ని గుంటూరు జిల్లా లో పైలట్ ప్రాజెక్టు కింద ప్రారంభించింది. ఆదరణ-పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 135 కులాలకు చెందిన నాలుగు లక్షల మందికి 90 శాతం సబ్సిడీతో రూ. 964 కోట్ల విలువ చేసే పనిముట్లను అందజేసింది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక పథకాన్ని ఆపేసింది. అప్పటికే ప్రభుత్వం దగ్గర ఉన్న పనిముట్లను కూడా లబ్ధిదారులకు ఇవ్వకుండా వదిలేయడంతో అవి పాడైపోయాయి. మళ్లీ ఆదరణ- 3 పథకాన్ని ప్రారంభించారు. ఆదరణ- 3 ద్వారా కల్లుగీత కార్మికులు, కుమ్మరి, కమ్మరి, వడ్రంగి, గొర్రెల కాపరులకు, వడ్డెర, భవన నిర్మాణ కార్మికులు, నాయి బ్రాహ్మణులు, రజకులు, చేనేత కార్మికులు, టైలర్స్, పాల వ్యాపారులు, ఎలక్ట్రీషియన్లకు రూ. 10 నుంచి 30వేల విలువ చేసే పనిముట్లు అందజేయనున్నారు. త్వరలో దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం కానుంది.

80వేల మంది మహిళలకు శిక్షణ

స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమం ద్వారా బీసీ మహిళలకు కుట్లు, అల్లిక పనుల్లో శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని త్వరలో ప్రారంభించబోతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 80వేల మందికి శిక్షణ ఇచ్చి, కుట్టు మిషన్లు అందజేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. గొర్రెలు, పాడిగేదెలు, పశువులకు కూడా రుణాలు అందజేయాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనికి సంబంధించి విధివిధానాలపై ఇంకా స్పష్టత రాలేదు.



గౌడ వర్గీయులకు మద్యం దుకాణాలు

కూటమి ప్రభుత్వం వచ్చాక మద్యం పాలసీ మారింది. పాత పద్ధతిలో ప్రైవేటు వ్యక్తులకే మద్యం దుకాణాలు కేటాయించారు. వాటిలో బలహీన వర్గాలకు భాగస్వామ్యం కల్పిస్తూ 10 శాతం షాపులను గౌడ వర్గీయులకు కేటాయించింది. తద్వారా గుంటూరు జిల్లాలో 13, పల్నాడు జిల్లాలో 13, బాపట్ల జిల్లాలో 12 షాపులు వారికి దక్కాయి. చేనేత కార్మికులకు మగ్గం ఉన్న ప్రతి కుటుంబానికి 200 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇవ్వడంతో మూడు జిల్లాల్లో 35వేల కుటుంబాలకు మేలు జరుగుతోంది. దీంతోపాటు బీసీలకు పీఎం సూర్యఘర్ సోలార్ ప్లాంటు కోసం రూ. 20వేలు అదనపు సబ్సిడీ ప్రకటించింది.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి

మే చివరికి పీఎంశ్రీ పాఠశాలల్లో పనులు పూర్తి చేయాలి

గుంటూరు (విద్య)ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఉమ్మడి జిల్లాలో పీఎం శ్రీ పథకం పేరుతో పాఠశాలల్లో చేస్తున్న పనులు మే నెలాఖరు నాటికి పూర్తి చేయాలని పాఠశాల విద్య సంయుక్త సంచాలకులు (ఆర్జేడీ) లింగేశ్వరరెడ్డి సూచించారు గురువారం కలెక్టరేట్ లోని ఆర్జేడీ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు ఉమ్మడి జిల్లాలో ఫేస్ వన్ ,ఫేస్ టు కింద పిఎం శ్రీ పాఠశాలలు మంజూరు అయ్యాయని ఆయా పాఠశాలల్లో చేస్తున్న పనులు సత్వరం పూర్తి చేసేలా ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని సూచిం చారు. నాణ్యత విషయంలో రాజీ పడకుండా కేంద్ర ప్రభుత్వం సూచించిన విధంగా పనులు చేయాలని స్పష్టం చేశారు. గడచిన ఐదు సంవత్సరాలలో చేసిన పనుల గురించి సమీక్షించారు. కార్యక్రమంలో డీఈఓ రేణుక, సమగ్ర శిక్ష ఇంజనీర్లు నాగజ్యోతి, హరిబాబు, పీఎంశ్రీ పథకం సంచాలకులు సురేష్‌కుమార్ పాల్గొన్నారు.



గురుకుల స్కూల్ భవనం

గిరిజన గురుకులం సిద్ధం

- ప్రారంభోత్సవ ఏర్పాట్లలో గిరిజన శాఖ
- పెదతురకపాలెం వద్ద రూ.8.20 కోట్లతో నిర్మాణం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని గిరిజన విద్యార్థులకు గురుకుల విద్య అందుబాటులోకి రానున్నది. ఈ విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభించేందుకు గిరిజన సంక్షేమ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. నరసరావుపేట మండలంలోని పెదతురకపాలెంలో గిరిజన గురుకుల పాఠశాల గత టీడీపీ ప్రభుత్వంలో మంజూరై పనులు చేపట్టారు. అయితే వైసీపీ హయాంలో నిధుల కొరతతో నిర్మాణం నిలిచిపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిధులు విడుదల చేసింది. దీంతో శరవేగంగా భవనాల నిర్మాణం పూర్తి చేశారు. తరగతి గదులు, బాలుర వసతి గృహాలు, స్టాఫ్ నివాస గృహాల నిర్మాణం పూర్తయింది. ఈ భవనాలను రూ.8.20 కోట్లతో నిర్మించారు. 250 సీట్లను కేటాయించగా త్వరలో అడ్మిషన్లు ప్రారంభం కానున్నాయి. గిరిజన బాలుర విద్యాభివృద్ధికి గురుకుల పాఠశాల దోహదపడనున్నది. బాలుర స్కూల్‌ను ప్రారంభించేందుకు విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామిని గిరిజన శాఖ అహ్వానించనున్నది. ప్రారంభోత్సవ తేదీని త్వరలో ఖరారు చేయనున్నట్లు సదరు అధికారులు తెలిపారు.



విద్యార్థుల వసతి గృహాలు

కుంభకోణంపై.. కనికరమా?

(5వ పేజీ తరువాయి)

ఇదే తీరు. జగనన్న కాలనీల పేరుతో పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తామంటూ స్థలం కొనుగోలు నుంచి ఇల్లు కట్టించి ఇచ్చే వరకు అంతటా అక్రమాలే. ఇందులో లబ్ధిదారులకు ఎటువంటి మేలు జరగకపోగా అటు అధికారులు, ఇటు నేతల మధ్య భారీగానే పంపకాలు జరిగాయి. పేదలకు ఇళ్ల స్థలాల కోసమని ప్రభుత్వం భూ సేకరణకు ప్రకటన చేయగా రైతులు ఎవరూ ముందుకు రాలేదు. ఈ క్రమంలో పెదరావూరులో టీడీపీ నాయకులతోనే సిఫార్సులు చేయించుకుని కొంత భూమిని కొని మార్కెట్ రేటుకు మించి అదనంగా రెండున్న రెట్లు డబ్బు చెల్లించారు. దీంతో మిగిలిన ప్రాంతాల్లో రైతులు ముందుకొచ్చారు. ఆ తర్వాత వైసీపీ నేతలు రంగంలోకి దిగి భూమాయ చేశారు. ఒక్క తెనాలిలోనే వైసీప దళారులు రంగప్రవేశం చేసి రైతుల వద్ద భూమిని తక్కువకు కొని రెండున్నర రెట్లకు ప్రభుత్వానికి ఇచ్చి భారీగా లబ్ధి పొందారు. పెదరావూరులో ప్రభుత్వం ఇచ్చిన నగదులో వాటాగా ఇవ్వమని నేతలు ఒత్తిడి చేయగా భూములను వెనక్కు తీసుకుంటామని రైతులు హెచ్చరించడంతో వదిలేశారని సమాచారం. మిగిలిన లేఅవుట్లలో అదనంగా డబ్బు వచ్చేలా చేసినందుకు ఎకరాకు రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు నేతలకు మామూళ్ల కింద వసూలు చేశారు. 2019లో తెనాలి ఐతానగర్‌కు సమీపంలో ఉన్న భూములను ఎకరా రూ.38 లక్షలకు భూములు ఇచ్చేందుకు ప్రభుత్వంతో రైతులు ఒప్పందం చేసుకున్నారు. అయితే ఆ తర్వాత వైసీపీ హయాంలో పట్టణానికి 4 నుంచి 6 కిలో మీటర్ల దూరంలోని భూములకు రూ.92 లక్షలకు పైగా ముట్టచెప్పడం భూ కుంభకోణానికి నిదర్శనంగా నిలుస్తోంది. ఇలా ఒక్క తెనాలిలో రూ.393.51 కోట్లు ఖర్చుపెట్టి 526.36 ఎకరాల భూమిని రైతుల నుంచి కొనుగోలు చేశారు. ఒక్క తెనాలిలో మాత్రమే రూ.100 కోట్లకు పైగా చేతులు మారితే, రాష్ట్రం మొత్తంలో ఏ మేర భూ కుంభకోణం జరిగిందనేది ఊహకే అందని విషయం. ఎకరాకు రూ.10 లక్షలు, రూ.17.5 లక్షల చొప్పున వాటాలిచ్చినందుకు తమకు ఇబ్బందేమీ లేదని, తమకు మార్కెట్ రేటుపై పెద్ద లాభమే జరిగిందని, ఆ విశ్వాసంతో కుంభకోణం జరిగినట్లు చెప్పడానికి రైతులు ముందుకు రావడంలేదని సమాచారం.

అధికారులకూ భారీగానే..

పేదల ఇళ్లకోసం కొన్న భూముల్లో నేతలకు మేళ్లు చేసిపెట్టినందుకు అధికారులకూ భారీగానే ముడుపులు అందినట్లు సమాచారం. ఎకరాకు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేశారన్న ఆరోపణలున్నాయి. గోలీల డొంక లేఅవుట్‌లో ఎకరాకు రూ.2 లక్షల చొప్పున 60 ఎకరాల్లో రూ.12 కోట్లు వసూలు చేసి రెవెన్యూ అధికారులు పంచుకున్నట్లు సమాచారం. మిగిలిన లేఅవుట్లలో వచ్చిన వాటాలు కలిపితే రూ.15 నుంచి రూ.20 కోట్ల వరకు అధికారులకు దక్కి ఉంటుందనేది అంచనా.

ఖాతాలు శోధిస్తే గుట్టురట్టు

రైతుల ఖాతాలకు ప్రభుత్వం నుంచి వచ్చిన నగదును డ్రా చేసి అదే రోజు కొన్ని ఖాతాల్లో జమ చేసినట్లు తెలిసింది. కేవలం వీటికోసమే కొన్ని కొత్త పరం ఖాతాలు తెరిచారని, మరికొన్ని వ్యాపార సంస్థల కరెంట్ ఖాతాలు కూడా వీటి కోసం వాడుకున్నారు. పిండికొట్ల బజార్‌లోని కెనరాబ్యాంక్, ఐతానగర్‌లోని సిండికేట్ బ్యాంక్, స్టేట్‌బ్యాంక్, కోస్టల్ బ్యాంక్, బుర్రిపాలెం రోడ్డులోని బ్యాంక్ ఆఫ్ ఇండియా, మరికొన్ని బ్యాంక్‌లలో ముందే మాట్లాడుకుని బ్యాంక్ సిబ్బందితో ఒప్పందం చేసుకున్నాకే లావాదేవీలు ఏ ఆటంకం లేకుండా చేసుకున్నారని చెబుతున్నారు. ఈ ఖాతాలు పట్టుకుంటే గుట్టంతా బయటకు వస్తుందని చెబుతున్నారు. అయితే ఆయా బ్యాంక్‌లలో అప్పట్లో ఉన్న మేనేజర్‌లు, ఇతర సిబ్బంది సహకారం పుష్కలంగా ఉండటంవల్లే ఇవన్నీ సాధ్యం అయ్యాయని, వారిని కూడా విచారిస్తే తేలికగా బండారం బయటకు వచ్చే అవకాశం ఉందంటున్నారు.

అధికారుల తీరుపై అనుమానాలు..

తెనాలిలో జరిగిన భూ కుంభకోణంపై తొలి నుంచి ఆలపాటి విచారణకు పట్టుబడుతూ వచ్చారు. అప్పట్లో వైసీపీ సర్కారు పట్టించుకోకపోతే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. భూ కొనుగోళ్లు జరిపిన బుర్రిపాలెం, నేలపాడు, పెదరావూరు, కొలకలూరు, అంగలకుదురు, గుడివాడ, సంగంజాగర్లమూడి గ్రామాల్లోని నాడు భూములు విక్రయించిన రైతులను విజిలెన్స్ అధికారులు నెల నుంచి విచారిస్తున్నారు. ఆ మొత్తాలు బ్యాంక్ ఖాతాల ద్వారా కాకుండా నేరుగా డబ్బే తీసుకోవడంతో, రైతులు చెప్పే ఆధారాలు మినహా రికార్డు పరంగా ఏ ఆధారాలు లేకపోవడంతో వారు తమపైకి ఏదీ రాదనే ధీమాతో ఉన్నట్లు సమాచారం. అయితే అప్పటి వీఆర్‌వోకు ఓ రైతు తన 2 ఎకరాలకు వచ్చిన డబ్బులో రూ.1.5 లక్షలు ఇచ్చినట్లు చెబుతున్నారు. ఆ బ్యాంక్ ఖాతాలు పట్టుకోగలిగితే గుట్టు వీడుతుంది. అయితే విచారణ సాగుతున్న తీరు చూస్తే కుంభకోణం గుట్టరట్టు చేసేలా కాకుండా అక్రమార్కులను కాపాడేలా ఉన్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే కూటమి నేతలు ఈ కుంభకోణం వెనుక దాగున్న రహస్యాలను విజిలెన్స్ అధికారుల ముందుంచారని సమాచారం. అయినా విచారణలో వేగవంతం లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



యూపీఎస్సీ పాత ప్రశ్నపత్రాలు - సమాధానాలు పుస్తకావిష్కరణ చేస్తున్న మండలి బుద్ధప్రసాద్ తదితరులు

మాతృభాషే సంస్కృతి పరిరక్షణకు మూలాధారం

- అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్
- కేఎల్‌యూలో తెలుగు భాష అంతర్జాతీయ సదస్సు

తాడేపల్లి (వడ్డేశ్వరం), ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఏ ప్రాంత సంస్కృతి పరిరక్షించబడాలన్నా ఆ ప్రాంత భాష ముందుగా రక్షించబడాలని తెలుగు భాషా సంఘం మాజీ అధ్యక్షుడు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. గురువారం వడ్డేశ్వరం కేఎల్ డీమ్డ్ యూని వర్సి టిలో బీఏ ఐఏఎస్ విభాగం అధిపతి శివనాగయ్య అధ్యక్షతన సదస్సు ఏర్పాటు చేశారు. ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ప్రక్రియలు, వాదా లు, సమాలోచన అనే అంశంపై ప్రారంభమైన రెండు రోజుల అంతర్జాతీ య సదస్సుకు బుద్ధ ప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ హితమే సాహిత్యం పరమావ ధని చెప్పారు. విశిష్ట అతిథిగా హాజరైన రాష్ట్ర రహదారు భద్రతా విభాగం డీజీ సీహెచ్ విజయారావు మాట్లాడుతూ మాతృభాషలో సివిల్ సర్వీసెస్ రాసి లక్ష్యాన్ని సాధించడం సులువవుతుందన్నారు. ఈ సందర్భంగా యూని వర్సిటీ ప్రచురించిన 11 సంవత్సరాల యూపీఎస్సీ పాత ప్రశ్నపత్రాలు- సమాధానాలు విశ్లేషణలతో కూడిన గ్రంథాన్ని వారు ఆవిష్కరించి విద్యా ర్థులకు అందజేశారు. మొదటి రోజు సదస్సులో ఆంధ్రా తెలంగాణ ప్రాంతా లకు చెందిన ప్రత్యక్షంగా 30 మంది, ఆన్‌లైన్‌లో 30 మంది ఆచార్యులు, పరిశోధనా విద్యార్థులు పరిశోధనా పత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో వాణిజ్య పన్నుల విభాగం అసిస్టెంట్ కమిషనర్ డి.రాంబాబు, ఆంధ్ర లయోల కళాశాల విశ్రాంత వైస్ ప్రిన్సిపాల్ గుమ్మా సాంబశివరావు, రచయిత్రి నయనాల వాణిశ్రీ, వీసీ సారధివర్మ, ప్రోవీసీలుతదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కే మధుమూర్తి

విద్యార్థులు సమయాన్ని వృథా చేసుకోవద్దు

ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య మధుమూర్తి

పెదకాకాని, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సమయాన్ని వృథా చేసుకోరాదని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కే మధుమూర్తి తెలిపారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డైక్‌మెన్ హాలులో ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో ఏఎన్యూ మహోత్సవం -2025 గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది దేశాభివృద్ధికి పాటుపడాలన్నారు. విద్యార్థులు ఎప్పుడు చదువును అశ్రద్ధ చేయకూడదన్నారు. ప్రతి విద్యార్థి అవకాశాలను సృష్టించుకుంటూ, అందిపుచ్చుకుంటూ అభివృద్ధి చెందాలన్నారు. ఉప కులపతి ఆచార్య గంగాధర్ మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకుని నైపుణ్యతను సమాజాభివృద్ధికి వినియోగించాలన్నారు. రెక్టార్ ఆచార్య రత్న శిలామణి మాట్లాడుతూ రెండు రోజులు జరిగే మహోత్సవంలో విద్యార్థులందరూ ఉత్సాహంగా పాల్గొని తమ విజ్ఞానాన్ని నైపుణ్యతలను ప్రదర్శించాలని కోరారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యార్థులు వారి విద్యా విషయాలు మీద ఎక్కువ దృష్టి పెట్టాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సిద్ధయ్య మాట్లాడుతూ విద్యార్థులు గొప్ప పారిశ్రామికవేత్తలుగా ఎదగాలన్నారు. అకాడమిక్ విభాగాలలో ఉత్తమ శ్రేణి సాధించిన విద్యార్థులకు బహుమతులను, సర్టిఫికెట్లను అందజేశారు. టెక్నికల్, లిటరల్లీ ఈవెంట్స్‌లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రిన్సిపల్స్ డాక్టర్ ఎం గోపికృష్ణ, డాక్టర్ బీ చంద్రమౌళి, కన్వీనర్ డాక్టర్ రవి కుమార్, డాక్టర్ సతీష్, డాక్టర్ కే చైతన్య, డాక్టర్ పూర్ణచంద్రశేఖర్, డాక్టర్ వై సునీత, డాక్టర్ ఉమా మహేశ్వరి, డాక్టర్ తిరుమలరావు, డాక్టర్ టీవీఎస్ వరలక్ష్మి, డాక్టర్ వి.బాలాజీ, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.






విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

ఆవుల మందే ఆధారం

వేమూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : పూర్వ కాలంలో వేసవి మాసం వస్తే చాలు రబీ పైర్లు పూర్తి కాగానే సాగు భూముల్లో భూమి సారవంతం కోసం ఆవుల మందలను కొన్ని రోజుల పాటు ఉంచేవారు. ఆవులు సాగు భూమిలో వదిలిన మూత్రం, పేడ మగ్గిన తరువాత మట్టిలో కలిసేవి తద్వారా మొక్కకు పోషకాలు అందేవి ప్రకృతి సిద్ధమైన అర్గనిక్ ఎరువు ఏ పైరు వేసిన సంపూర్ణంగా అందేది పాస్పరస్, పోటాషియం, నైట్రోజన్ తగినంతగా మొక్కలకు అందడంతో పాటు ఊహించని రీతిలో దిగుబడులు కూడా వచ్చి రైతులు లాభసాటి వ్యవసాయాన్ని చవి చూసేవారు. అలాంటిది రాను రాను సేంద్రీయ ఎరువుల వాడకం పెరగడం వల్ల ఆవులు, గొర్రెలు, మేకల మందను చేలలో తోలే విధానం కూడా తగ్గిపోయింది. అక్కడక్కడ కొద్ది మంది రైతులు మాత్రమే ఆవుల మందను చేలలో కట్టు వేస్తున్న దృశ్యాలు కనబడుతున్నాయి. పల్నాడు జిల్లా బొల్లాపల్లి మండలం, ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం ప్రాంతాలకు చెందిన కేవలం ఆవుల మంద కట్టి దానిపై వచ్చే ఆదాయంతోనే జీవనం గడుపుతున్న కొన్ని కుటుంబాలు ఈ ఏడాది కూడా మండల పరిధి లోని కొన్ని గ్రామాలకు రావడం జరిగింది. వారిని ప్రశ్నిస్తే... పూర్వ కాలంలో ప్రతి రైతు తమ భూమిలో తప్పనిసరిగా ఆవులు, గొర్రెలు మందను తోలేవారని ఆ రోజుల్లో డబ్బు తక్కువ ఇచ్చిన వలస వెళ్లిన తమ కుటుంబాలకు మర్యాదగా భోజన వసతులు కూడా కల్పించే వారని, ఈనాడు మందను కట్టి వేయడమే బాగా తగ్గిపోయిందని దాని వల్ల ఇదే జీవనంగా కొనసాగుతున్న కొన్ని వందల కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్త పరుస్తున్నారు. వేసవిలో వలసగా వచ్చి జీవనం చేసుకుంటూ మిగతా రోజుల్లో ఆవులను అడవిలోకి తోలడం జరుగుతుందన్నా డు. ప్రస్తుత పరిస్థితులు తమకు దయనీయంగా ఉన్నాయని ప్రభుత్వం ఆవులే జీవనాధారంగా బతికే కుటుంబాలను ఆదుకోవాలని బొల్లాపల్లి మండలం, గంగుపల్లికి చెందిన మంద రైతు పాలం బ్రహ్మం ఆవేదన వ్యక్తపరిచాడు.



వేమూరు వద్ద పొలాల్లో మంద ఆవులు



రైతు బ్రహ్మం

న్యాయం చేయండి

- పురుగుమందు డబ్బాలతో కలెక్టరేట్‌కు గ్రంథసిరి మిర్చి రైతులు

గుంటూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా అచ్చంపేట మండలానికి చెందిన గ్రంథసిరి మిర్చి రైతులు తమకు జరిగిన అన్యాయంపై చర్యలు తీసుకోవాలని గుంటూరు జిల్లా అధికారులను ప్రాధేయపడుతున్నారు. ఇప్పటికే అనేకమార్లు మార్కెటింగ్ అధికారులు, పోలీసులు, తెలుగుదేశం పార్టీ ప్రజాప్రతినిధులను ఆశ్రయించిన బాధితులు గురువారం పురుగు మందు డబ్బాలతో కలెక్టరేట్‌కు వచ్చి తమ గోడును వెళ్లబోసుకొన్నారు.

గ్రంథసిరి గ్రామానికి చెందిన రైతులు కోటపాటి రామకోటేశ్వరరావు, పరుచూరి ప్రతాప్, కిలారి నాగేశ్వరరావు, కోటపాటి నాగేశ్వరరావు, కోటపాటి నరసింహారావులు గత ఏడాది మిర్చియార్డులో విజయభాస్కర ట్రేడర్స్‌కు చెందిన గోపు శ్రీనివాసరెడ్డి, సంగిలి కిశోర్‌రెడ్డికి మిర్చిని విక్రయించారు. ఒక్కో రైతుకు రూ. 10 లక్షలకు పైగా వ్యాపారస్థులు బకాయిపడ్డారు. ఇప్పటివరకు వాళ్లకి చిల్లిగవ్వ కూడా చెల్లించకుండా తిప్పుతున్నారు. వాళ్ల వెనక వైసీపీకి చెందిన ఒక నేత ఉన్నారని ఆరోపించారు. తాము మిర్చియార్డు, మార్కెటింగ్ అధికారులను కలిసి ఫిర్యాదు చేశామని, అయితే వాళ్లపై నామమాత్రంగా చర్యలు తీసుకొని వారికే సహకరిస్తున్నారని నిందించారు. అలానే నెల క్రితం తాము కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, గుంటూరు ఎస్పీ సతీష్ కుమార్‌ని కలిసి ఫిర్యాదు చేశామని, దాంతో వాళ్ల ఆదేశాల మేరకు కేవలం శ్రీనివాసరెడ్డి, కిశోర్ రెడ్డిల లైసెన్సులు మాత్రమే నిలుపుదల చేసి చేతులు దులుపుకొన్నారని చెప్పారు. కలెక్టరేట్‌లో ఇన్‌చార్జ్ కలెక్టర్ భార్గవ తేజ అందుబాటులో లేకపోవడంతో డీఆర్‌వో షేక్ ఖాజావలికి వినతిపత్రం ఇచ్చి గ్రంథసిరి రైతులు అక్కడి నుంచి నిష్క్రమించారు.



కలెక్టరేట్‌కు వచ్చిన గ్రంథసిరి మిర్చి రైతులు

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

నాదెండ్ల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిరుమామిళ్ళకు చెందిన బాలికకు వివాహం చేయాలని బంధువులు నిర్ణయించటంతో సమాచారం అందుకున్న అధికారులు గురువారం అడ్డుకున్నారు. 16 సంవత్సరాల 11 నెలల వయస్సు కలిగిన బాలికకు తండ్రి లేడు. తల్లితో పాటు కుటుంబ సభ్యులు 22 ఏళ్ళ యువకుడితో ఈ నెల 13న వివాహం చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ విషయమై సమాచారం తెలుసుకున్న ఎంపీడీవో స్వరూపరాణి, సూపర్‌వైజర్ పద్మ, మరో అధికారి ప్రశాంత్‌లు గ్రామానికి చేరుకొని కౌన్సెలింగ్ ఇచ్చారు. బాల్య వివాహాల వల్ల జరిగే నష్టాలను తల్లికి వివరించి ఆమె నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు.

కొత్త రైల్వే లైన్ కోసం రైల్వే మంత్రికి ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు లేఖ

చిలకలూరిపేట ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పార్లమెంట్ నియోజకవర్గంలో కొత్త రైల్వే లైన్ ఏర్పాటు కోరుతూ రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు లేఖ రాశారు. న్యూ పిడుగురాళ్ల రైల్వే స్టేషన్ నుంచి నరసరావుపేట, చిలకలూరిపేట మీదుగా చీరాల వరకు ఈ రైల్వే లైన్ నిర్మించాలని ఆయన కోరారు. నూతన రైల్వేలైన్ ఆవశ్యకత గురించి మూడు రోజుల క్రితం చిలకలూరిపేటలో జరిగిన ప్రజా పరిష్కార వేదికలో చిలకలూరిపేట రైల్వే లైన్ సాధన సమితి కన్వీనర్ సీపీఐ సుభాని ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు.

సీఎంకు వినతిపత్రం

చిలకలూరిపేట ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): న్యూ పిడుగురాళ్ల రైల్వేస్టేషన్ నుంచి నరసరావుపేట, చిలకలూరిపేట మీదుగా చీరాల వరకు నూతన రైల్వే లైన్ నిర్మించాలని కోరుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సీపీఐ సుభాని అమరావతిలో సీఎం చాంబర్‌లో కలిసి వినతిపత్రాన్ని గురువారం అందచేశారు. హైదరాబాదు నుంచి చెన్నైకు చాలా త్వరగా చేరుకోవచ్చునని, తక్కువ సమయంలో, తక్కువ వ్యయంతో సరుకు రవాణా చేయవచ్చునని పేర్కొన్నారు.

గర్భిణులకు వరం కిల్కారి సేవలు: డీఎంహెచ్‌వో రవి

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం గర్భిణుల కోసం బాలింతల కోసం కిల్కారి కార్యక్రమాన్ని ప్రవేశపెట్టినట్లు పల్నాడు జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గర్భిణులకు నాలుగో నెల మొదలుకొని బిడ్డకు మొదటి సంవత్సరం పూర్తయ్యేవరకు వారానికి ఒకసారి ఫోన్‌లో సూచనలు వస్తాయన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే కిల్కారి కాల్స్ 01244452660 నెంబర్ నుంచి వస్తాయన్నారు. ఈ నెంబరు మొబైల్‌లో నమోదు చేసుకోవాలన్నారు. కాల్ వచ్చినప్పుడు లిఫ్ట్‌చేసి పూర్తిగా సమాచారాన్ని వినాలని కోరారు. మరలా ఆ సమాచారాన్ని వినాలంటే 14423 అనే టోల్ ఫ్రీ నెంబరుకు ఫోన్‌చేసి వినవచ్చున్నారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి: తహసీల్దార్

ఈపూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రతి సమస్యను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ సురేష్ అధికారులను ఆదేశించారు. ఈపూరు రెవెన్యూ కార్యాలయంలో గురువారం గ్రామ రెవెన్యూ అధికారులు కార్యాలయం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిశీలించి పరిష్కరించాలన్నారు. సిబ్బంది ఎవరైనా అలసత్వం వహిస్తే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఆర్ఐ పద్మావతి, వీఆర్వోలు పాల్గొన్నారు.

బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన ఆటో డ్రైవర్‌కు దేహశుద్ధి

వినుకొండ టౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) ఎల్‌కేజీ చదువుతున్న బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన ఆటో డ్రైవర్‌కు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన సంఘటన మండలంలోని భారతాపురంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం వినుకొండకు చెందిన నటేష్ గణేష్ బస్సు డ్రైవర్. మండలంలోని భారతాపురం గ్రామం నుంచి బస్సులో విద్యార్థులను పాఠశాలకు తీసుకువెళుతుంటాడు. గ్రామంలో రోడ్డు నిర్మాణ పనులు జరుగుతుండటంతో డ్రైవర్ గణేష్ బస్సుకు బదులు ఈ నెల 8వ తేదీన ఆటో ఏర్పాటు చేశాడు. పాఠశాల నుంచి ఇంటికి వచ్చే సమయంలో దారిలో ఆటో మరమ్మతులకు గురైందని నమ్మించి ఐదుగురు విద్యార్థులను కిందకు దించేసి, ఎల్‌కేజీ చదివే బాలికను నిర్మానుష ప్రాంతానికి తీసుకుపోతుండగా గ్రామస్థులు గమనించి అడ్డుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. జరిగిన సంఘటనపై పోలీసులు విచారించి గణేష్‌పై కేసు నమోదు చేసి గురువారం కోర్టుకు హాజరు పరిచినట్లు పోలీసులు తెలిపారు.

ప్రోగ్రామింగ్‌లో ఉచిత శిక్షణ

వినుకొండ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వినుకొండ ప్రాంతంలోని పేద విద్యార్థులకు ఉచిత కోడింగ్ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఇందూరి రామాంజిరెడ్డి (ఐఐటీ బాంబే) ఒక ప్రకటనలో తెలిపారు. విఠంరాజుపల్లి సమీపంలోని సాయిబాబా దేవస్థానం పక్కన ఉన్న తమ ఇనిస్టిట్యూట్‌లో ఏప్రిల్ 13 నుంచి క్లాసులు ప్రారంభమవుతాయని తెలిపారు. శిక్షణ కోసం వచ్చే విద్యార్థులు మొబైల్ ఫోన్ కానీ, ల్యాప్‌టాప్, ట్యాబ్ కచ్చితంగా తీసుకురావాలని సూచించారు. 8వ తరగతి నుంచి బీటెక్ వరకు చదివిన విద్యార్థులు అర్హులని తెలిపారు.

విగ్రహ ప్రతిష్ఠ పూజలు ప్రారంభం

రొంపిచర్ల, ఏప్రిల్ 10 (ఆంధ్రజోతి): మండలంలోని రొంపిచర్లలో అంకమ్మ తల్లి ఆలయంలో ఈ నెల 12వ తేదీన విగ్రహ ప్రతిష్ఠ జరగనున్న నేపథ్యంలో గురువారం ఆలయ ఆవరణలో జరిగిన పూజల్లో దంపతులు పాల్గొన్నారు. బుధవారం రాత్రి ప్రతిష్ఠించనున్న విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు.

ఉపాధి హామీ పథకానికి ఊతం

- ఆరు రకాల విభాగాలకు గుర్తింపు
- రైతులు, కూలీలకు ప్రయోజనం
- అమలుకు యంత్రాంగం కృషి


ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

బొల్లాపల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ పథకం ద్వారా రైతులు, ఇటు కూలీలు మరింత చేరువై ఉపాధి అవకాశాలు మెరుగుపరచటానికి చర్యలు చేపట్టాయి. ఇందుకోసం ఆరు పథకాలను అమలు చేస్తున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి జూన్ 30వ తేదీలోపు పూర్తిచేయాలని, రెండు వందల రోజుల ప్రత్యేక కార్యక్రమంగా రూపొందించారు. వీటి ద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అధికారులు చెపుతున్నారు.

అమలు చేస్తున్న పథకాలు

పంట కుంటలు ప్రతి పంచాయతీలో కనిష్ఠంగా 25 నిర్మించాలి. రైతులు వీటిని వ్యక్తిగతంగా తమ పొలాల్లో ఏర్పాటు చేసుకునేలా నిబంధనలు రూపొందించారు. దీనివల్ల భూగర్భ జలాలు పెరగటంతో రైతు తన వ్యవసాయ పనులతో పాటు చేపలు పెంచవచ్చు. రింగ్ బౌండరీ ట్రెంచర్ తవ్వకంతో పొలాలు కోతకు గురి కాకుండా కాపాడుకోవచ్చు.

● నీటి గుంటలు తీసి అందులో చేపలు పెంపకానికి అనువుగా మార్చుకోవటం, ప్రతి పంచాయతీలో ఒక పాండ్ నిర్మిచాలి. నీటి కుంటగా కూడా వినియోగించు కోవచ్చు.

అమృత సరోవర్

చెరువుతో పాటు మైనర్ ఇరిగేషన్, సాగునీటి వనరులు ఉన్న ప్రతి పంచాయతీలో ఒక చెరువును ఎంపిక చేసి పూడికతీత, చెరువు కట్టలు బలోపేతం, కంప చెట్లు తొలగించటం చేస్తారు.

గోకులం

పాడి పరిశ్రమ అభివృద్ధికి ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేస్తూ ప్రతి పంచాయతీలో కనిష్ఠంగా రెండు గోకులం షెడ్ల నిర్మాణాలకు అవకాశం కల్పించారు. ఇప్పటికే పలు గ్రామాల్లో గోకులాల షెడ్లు నిర్మించారు. మరికొన్ని నిర్మాణాల్లో ఉన్నాయి.

చదువుకున్న విద్యార్థుల కోసం

ఉపాధి కూలీలు కుటుంబాల్లో వంద రోజుల పని దినాలు పూర్తయి ఆ కుటుంబంలో చదువుకున్న విద్యార్థుల కోసం వారికి ఇష్టమైన విభాగాల్లో నైపుణ్యాలపై ఉచితంగా శిక్షణ ఇస్తారు. శిక్షణలో రోజుకు మూడు వందల రూపాయల భృతి ఇస్తారు.

సంఘాలకు పునర్జీవం

ప్రతి 50మంది కూలీలకు ఒక మేటుగా శ్రమశక్తి సంఘం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. గతంలో ఉన్న ఈ పథకాన్ని మధ్యలో నిలిపి వేశారు. మళ్ళీ ఈ సంఘాలను పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టారు. కూలీల్లో చైతన్యం కలిగించి వారిని నిత్యం పనులకు వచ్చేలా కృషిచేస్తే ఒక్కొక్క కూలీకి రోజుకు రూ.1.50 చొప్పున మేటుకు అదనంగా ఇస్తారు. వంద రోజులు పూర్తయ్యాక రోజుకు మూడు రూపాయల చొప్పున ప్రోత్సాహం లభిస్తుంది. మండలంలో మొత్తం 33 పంచాయతీలు, వంద రోజుల పని దినాలు పూర్తి చేసుకున్న కుటుంబాలు 686, జారీ చేసిన జాబ్ కార్డులు, 19,315, పథకంలో నమోదైన కూలీలు 33,792 మంది ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై డీఎంహెచ్‌వో అసంతృప్తి


శావల్యాపురం పీహెచ్‌సీ పరిసరాలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో రవి

శావల్యాపురం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరిసరాల పరిశుభ్రతను క్షేత్రస్థాయిలో పరిశీలించిన డీఎంహెచ్‌వో డాక్టర్ రవి సిబ్బంది పనితీరుపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. సాధారణ తనిఖీల్లో భాగంగా శావల్యాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌వో రవి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలోకి రాగానే చెత్తతొట్టిలో చెత్త పేరుకుపోయి ఉండడాన్ని గమనించి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం పీహెచ్‌సీ రికార్డులు, ఓపీలు, ల్యాబ్ పరీక్షలు, మందుల నిల్వలు, ప్రభుత్వ సర్వేల పురోగతి, సిబ్బంది పనితీరు తదితర అంశాలను పరిశీలించారు. క్యూఆర్‌కోడ్ ద్వారా పీహెచ్‌సీకి వచ్చే రోగుల ఓపీలు నేరుగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, రోగులకు అందించే మందులను కూడా ఆన్‌లైన్‌లో నమోదుచేసి ప్రింట్ తీయాలన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి రావిపూడి రమ్య, హెల్త్ సూపర్‌వైజర్ ఏడుకొండలు, ల్యాబ్ టెక్నీషియన్లు సీతారామయ్య, సతీష్, స్టాఫ్‌నర్స్ ధనలక్ష్మి, ఫార్మసిస్ట్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రొంపిచర్ల పీహెచ్‌సీలో...

రొంపిచర్ల, ఏప్రిల్ 10 (ఆంధ్రజోతి): మండల కేంద్రమైన రొంపిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ రవి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రం ద్వారా రోగులకు అందుతున్న సేవల గురించి వైద్యులు జగన్ నరసింహారెడ్డి, సాయిబాబులను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చే వారికి సక్రమమైన వైద్యం అందేలా చూడాలని ఆదేశించారు. ఓపీ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఆస్పత్రి ఆవరణలో నిర్మాణంలో ఉన్న గదులను పరిశీలించారు.

నరేంద్రమోదీ సారథ్యంలో వికసిత్ భారత్ వైపు అడుగులు

పల్నాడు జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఏలూరి శశికుమార్



సమావేశంలో మాట్లాడుతున్న పల్నాడు జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఏలూరి శశికుమార్

వినుకొండ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ సారధ్యంలో వికసిత్ భారత్ వైపు దేశం అడుగులు వేస్తోందని పల్నాడు జిల్లా అధ్యక్షుడు ఏలూరి శశికుమార్ అన్నారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఆదేశాల మేరకు పల్నాడు జిల్లా అధ్యక్షుడు ఏలూరి శశికుమార్ సూచనల మేరకు స్థానిక జాషువా కళాప్రాంగణం ఆవరణలో బుధవారం రాత్రి భారతీయ జనతా పార్టీ క్రియాశీల సభ్యుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా అధ్యక్షుడు ఏలూరి శశికుమార్ మాట్లాడుతూ పార్టీ జనసంఘ్ నుంచి ఆవిర్భవించి అది భారతీయ జనతా పార్టీగా రూపాంతరం చెందిందన్నారు. భారతదేశాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీ 40 సంవత్సరాల అవినీతి, బంధుప్రీతి, కుటుంబపాలనకు పాల్పడి దేశాన్ని సర్వనాశనం చేసిందని వక్తలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు ఎన్‌డీఏ కూటమి పాలన హయాంలో వేల కోట్ల రూపాయల పెట్టుబడితో పాటు పోలవరం ప్రాజెక్టు, అమరావతి రాజధాని నిర్మాణానికి కేంద్రం మొదటి ప్రాధాన్యంగా నిధులు మంజూరు చేస్తుందన్నారు. కరోనాను పారదోలి ప్రజల పాలనలకు సురక్షితమైన వ్యాక్సిన్ అందించిన ఘనత బీజేపీదే అన్నారు. రానున్న రోజుల్లో పార్టీ పటిష్ఠతకు క్యాకర్తలు కష్టపడి పనిచేయాలని, కష్టపడి పని చేసిన నాయకులకు సముచితస్థానం కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మేడం రమేష్, జొన్నలగడ్డ బాబ్జీ, క్రియాశీల సభ్యులు, మండల పార్టీ అధ్యక్షులు మండల నాయకులు, మహిళా నాయకులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

వినుకొండ మునిసిపల్ కమిషనర్‌కు పురస్కారం

వినుకొండ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్‌కు గురువారం సత్కారం జరిగింది. ఆంధ్రప్రదేశ్ పురపాలక సంఘాల్లో ఆస్తి పన్ను వసూలులో వినుకొండ పురపాలక సంఘం 94.7శాతంతో మొదటి స్థానంలో నిలిచింది. గురువారం విజయవాడలో జరిగిన సమావేశంలో మునిసిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్‌ను ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్‌కుమార్, సీడీఎంఏ కమిషనర్ సంపత్ కుమార్‌లు పురస్కారాన్ని అందజేసి ఘనంగా సన్మానించారు. ఉద్యోగులు, నాయకులు కమిషనర్‌కు అభినందనలు తెలిపారు.

ఎన్‌సీసీ ఫలితాలలో ఎస్‌ఈసీ విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత

నరసరావుపేట రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు 2025వ సంవత్సరం ఎన్‌సీసీ సీ సర్టిఫికెట్ పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏ గ్రేడ్‌లో 19 మంది, బీ గ్రేడ్‌లో 10మంది, మిగతావారు సీ గ్రేడ్‌లో ఉత్తీర్ణులైనట్లు తెలిపారు.

రీ సర్వేతో భూ సమస్యల పరిష్కారం

నూజెండ్ల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రీ సర్వేను సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని, రైతుల సహకారంతో రీ సర్వేను త్వరితగతిన పూర్తిచేస్తామని, తద్వారా రైతుల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ జీ రమేష్ కుమార్ అన్నారు. మండలంలోని పాత ఉప్పలపాడులో గురువారం రాత్రి రీ సర్వేపై గ్రామ సభ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ బాల వెంకటేశ్వర్లు, మండల సర్వేయర్ చండీరాణి తదితరులు పాల్గొన్నారు.

పెద్దవరంలో తోబుట్టువుల దినోత్సవం

నూజెండ్ల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): తోబుట్టువుల అనుబంధం వెలకట్టలేనిదని, తల్లిదండ్రుల తరువాత మరో తల్లిదండ్రులు తోబుట్టువులని పెద్దవరం పాఠశాల హెచ్ఎం ఘంటా నాగేశ్వరరావు అన్నారు. గురువారం జాతీయ తోబుట్టువుల దినోత్సవం సందర్భంగా పెద్దవరం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు తోబుట్టువులతో స్వీట్లు పంచుకొని పరస్పరం అభినందనలు తెలుపుకున్నారు.

కేంద్రం మావోయిస్టులతో చర్చలు జరపాలి

● ప్రజా సంఘాల నాయకుల డిమాండ్

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పల్నాడు జిల్లా నరసరావుపేటలోని కోటప్పకొండరోడ్డులో పలువురు నేతలు మీడియా సమావేశం నిర్వహించారు. గత నెల 28న మావోయిస్ట్ పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ శాంతి చర్చలకు సిద్ధమని ప్రకటించారన్నారు. ఆయుధాలు వదిలి చర్చలకు రావాలని చత్తీస్‌ఘడ్ హోమ్‌మంత్రి ప్రకటించారని, లొంగిపోవాలని కేంద్ర హోమ్‌మంత్రి ప్రకటించారన్నారు. ఎలాంటి నిబంధన లేకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్చలకు ముందుకు రావాలని పీస్ కమిటీ ప్రకటించిందన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం చర్చలపై ఇంతవరకు ప్రకటన చేయలేదన్నారు. చట్టం, ప్రజాస్వామ్యం కాపాడాలంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే చర్చలు ప్రతిపాదనను అంగీకరించాలన్నారు. శాంతియుత వాతావరణం కల్పించి, ప్రభుత్వం వైపు నుంచి ప్రకటన ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎం రాష్ట్ర నాయకుడు వై వెంకటేశ్వరరావు, అమరవీరుల బంధుమిత్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బీ అంజమ్మ, పౌర హక్కుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చికినం చిన్నా తదితరులు పాల్గొన్నారు.

పేగు నుంచి వేప పుల్ల తొలగింపు

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ పేగులోకి వెళ్ళిన 26 సెంటీమీటర్ల వేప పుల్లను అడ్వాన్స్ ఎండోస్కోపీ సాయంతో పేగునుంచి తీసి పట్నానికి చెందిన వైద్యుడు డాక్టర్ లోకిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఓ వ్యక్తి ప్రాణాలను కాపాడారు. నకరికల్లు మండలం గుల్లపల్లి గ్రామానికి చెందిన 28సంవత్సరాల కే గురవయ్య రెండు రోజులుగా ఆహారం మింగుడు పడకపోవడంతో పట్టణంలోని డాక్టర్ అంజిరెడ్డి వైద్యశాల సంప్రదించాడు. శ్రీనివాస్ రెడ్డి అడ్వాన్స్ ఎండోస్కోపిస్తాయంతో పేగులో ఇరుక్కుపోయిన వేప పుల్లను గుర్తించి తొలగించారు. పేగులో పుండు వద్ద రక్తస్రావం ఆపడం కోసం ఇంజక్షన్ ఇచ్చి పేషెంట్‌ను ఇబ్బంది నుంచి రక్షించి ప్రాణాలు కాపాడారు. పేషంట్ కుటుంబ సభ్యులు డాక్టర్ల బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ఈపూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని బొమ్మరాజుపల్లి సమీపంలో కనుమ వద్ద గురువారం జరిగింది. ముప్పాళ్ళ గ్రామానికి చెందిన ముప్పాళ్ళ మరియబాబు మోటార్‌బైక్‌పై కారంపూడి వైపు వెళుతున్నాడు. టిప్పర్ రావడంతో బైక్ అదుపుతప్పి పడింది. మరియబాబు కాలుకు, దవడకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని వినుకొండ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లి ప్రథమ శిక్ష చేసి మెరుగైన వైద్యం కోసం నరసరావుపేట ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి నట్లు ఎస్ఐ ఎం ఉమామహేశ్వర చెప్పారు.

ప్రకృతి వ్యవసాయం పై ర్యాలీ

బొల్లాపల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): బొల్లాపల్లి, మండలంలోని వెల్లటూరు యూనిట్ ఇన్‌చార్జ్ ఎండ్లనూరి హనుమంతరావు ఆధ్వర్యంలో గురువారం ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌లో 2025-26 సంవత్సరంలో ప్రతి రైతు భూమి విస్తీర్ణం, పాడి పంటలు, ఖర్చుల వివరాలు సిబ్బందికి తెలియజేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయంపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంజలిదేవి, భూలక్ష్మి, సుబ్బారత్నం, ప్రవల్లిక పాల్గొన్నారు.

మాజీ ఉప సర్పంచ్ సీతారామయ్యకు ఎంపీ లావు నివాళి

నాదెండ్ల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మృతిచెందిన కనపర్రు మాజీ ఉప సర్పంచ్, టీడీపీ సీనియర్ నాతాని సీతారామయ్యకు ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు గురువారం నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి గ్రామాభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కాగా ఆయన భౌతిక కాయానికి ఉదయం జీడీసీసీబీ మాజీ చైర్మన్ మానం వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు సదాశివరావు, ఎస్ఎస్ సుభానీ, గంగా శ్రీనివాసరావు, బండారుపల్లి సత్యనారాయణ, ఎం జగన్నాధరెడ్డి, గుర్రం నాగ పూర్ణచంద్రరరావు, వాసిరెడ్డి రవి, కొల్లి బ్రహ్మయ్య, లాం కోటేశ్వరరావు తదితరులు నివాళులర్పించారు.

17, 23, 24న దివ్యాంగుల సర్టిఫికెట్ల తనిఖీ

బొల్లాపల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 17, 23, 24 తేదీల్లో దివ్యాంగుల సదరం సర్టిఫికెట్ల తనిఖీ జరుగుతుందని ఎంపీడీవో సీతారామయ్య తెలిపారు. మండలంలో 352, వెల్లటూరులో 92 పింఛన్‌దారులు గుంటూరులోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తమ వద్ద ఉన్న సర్టిఫికెట్లతో హాజరు కావాలని ఎంపీడీవో పిలుపునిచ్చారు. వీరికి నోటీసులు కూడా ఇవ్వటం జరుగుతుందన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై గ్రామ స్థాయిలో అవగాహన కల్పించాలి

● జిల్లా డీపీఎం అమలకుమారి

నాదెండ్ల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై రైతులకు గ్రామ స్థాయిలో అవగాహ కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా డీపీఎం కే అమల కుమారి అన్నారు. నాదెండ్లలోని రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ అనుబంధ శాఖలు, వెలుగు, డీఆర్‌డీఏ తదితర విభాగాల వారితో గురువారం సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో రైతు సాధికారిత సంస్థ ఏవో శ్రీనివాసరావు, ఏడీపీఎం ప్రేమ్‌రాజు, లక్ష్మి, మన్విత, ఉష, ఏవో హరి ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

సంపద సృష్టించటమే ప్రభుత్వ లక్ష్యం

● స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఈడీ బొంతా అర్జునరావు

నాదెండ్ల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపదను సృష్టించటమే ప్రభుత్వ లక్ష్యమని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బొంతా అర్జునరావు అన్నారు. మండల కేంద్రమైన నాదెండ్లలో గురువారం ఆయన పర్యటించారు. స్థానికంగా ఉన్న ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని సందర్శించారు. గ్రామంలో చెత్త సేకరిస్తున్న విధానాన్ని గ్రీన్ అంబాసిడర్ల నుంచి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చెత్త సేకరణలో ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. ఆయనతో పాటు ఎంపీడీవో స్వరూపరాణి, ఈవోపీఆర్‌డీ నిర్మల లక్ష్మీకుమారి, సర్పంచ్ మొగిలి నాగలక్ష్మి, కార్యదర్శులు సుబ్బారావు, మారుతీబాబు పాల్గొన్నారు.


హాస్పటల్ డెవలప్‌మెంట్ సొసైటీ నూతన కమిటీతో ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు

ప్రభుత్వ వైద్యశాలలో మెరుగైన సేవలందిస్తాం

● ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 10, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్యశాలలో మెరుగైన వైద్య సేవలందేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు వెల్లడించారు. గురువారం హాస్పటల్ డెవలప్‌మెంట్ సొసైటీ నూతన కమిటీ ప్రమాణస్వీకారం సమావేశంలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాల కరోనా సమయంలో రాష్ట్రంలోనే మెరుగైన స్థానంలో నిలిచి చరిత్ర సృష్టించిందన్నారు. ఈ వైద్యశాలను మరో 150 పడకలతో 350 పడకల బోధనా ఆసుపత్రిగా మార్చేందుకు రెండేళ్లలో చర్యలు తీసుకుంటామన్నారు. హెచ్‌డీఎస్ నూతన కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపి, వైద్యశాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు మాట్లాడుతూ నరసరావుపేట ఏరియా ప్రభుత్వ వైద్యశాలలోని వైద్యులు సిబ్బంది సేవే ప్రధానంగా విధులు నిర్వహించాలన్నారు. వైద్యశాలలో నర్సింగ్ సిబ్బంది కొరత సమస్యగా ఉందని ఎంపీ దృష్టికి తీసుకువెళ్లారు. పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యంతో నరసరావుపేట ప్రాంతీయ ప్రభుత్వ వైద్యశాలను మెడికల్ కళాశాలగా తీర్చిదిద్దాలన్నారు. ప్రభుత్వ వైద్యశాలకు 75 పడకలతో కూడిన క్రిటికల్ కేర్ బ్లాక్ మంజూరు అయిందని దీనికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం 36కోట్ల రూపాయలను మంజూరు చేసిందన్నారు. పల్నాడు బస్టాండ్‌లోని పాత వైద్యశాలలో 100 పడకలతో తల్లీబిడ్డల యూనిటును ప్రారంభించడానికి కృషి చేస్తున్నామన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన హెచ్‌డీఎస్ చైర్మన్ డాక్టర్ రెడ్డి వెంకటేశ్వరరెడ్డి, డాక్టర్ కంకణపాటి భారతి, మల్లికార్జునరావు, సుబ్బమ్మ, ప్రసాద్‌లను అభినందించారు. కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ బీవీ రంగారావు, ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్.సురేష్‌కుమార్, ఆర్‌ఎంవోలు డాక్టర్ ఏడుకొండలు, కే.దయానిధి, వైద్యులు మంత్రునాయక్, ప్రసూన, అలేఖ్య, కౌముది, రామేశ్వరి, నజియా, హేమశ్రీ పాల్గొన్నారు.


ఆర్టీసీ గేటు వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఎన్ఎంయూ నాయకులు

ఆర్టీసీలో సమస్యలను పరిష్కరించాలని ధర్నా

వినుకొండ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినుకొండ డిపో ఎదుట ఎన్ఎంయూ డిపో కార్యదర్శి శివప్రసాద్‌నాయక్ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు అన్ని డిపోల ముందు ఈ నెల 11, 12 తేదీల్లో గేట్ మీటింగ్, ధర్నా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ సందర్భంగా డిపో అధ్యక్షుడు బూదాల సౌభాగ్యరాజు మాట్లాడుతూ ఆర్టీసీలో పనిష్మెంట్లను నిలిపివేయాలని, అక్రమ పనిష్మెంట్లు, సస్పెన్షన్లను ఎత్తివేయాలని, 1/2019 సర్క్యులర్ అమలు చేయాలని, పాత వైద్యవిధానాన్ని పునరుద్ధరించాలని, ప్రమోషన్లు త్వరగా ఇవ్వాలని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు, ఆన్‌కాల్ డ్రైవర్లకు భత్యం పెంచాలని బదిలీలు త్వరగా చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే రాష్ట్ర కమిటీ 13సార్లు సమస్యలపై వినతిపత్రం అందించినప్పటికీ నేటికి అవి పరిష్కారానికి నోచుకోలేదని, ప్రభుత్వం త్వరగా సమస్యలను పరిష్కరించని నేపథ్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ముప్పాళ్ల శ్రీను, ఆదెయ్య, కాళి, శ్రీను, హరిబాబు, ఈపీకేరావు, కిరణ్, తులసీనాయక్, నాగేశ్వరరావు, కటారి శ్రీను తదితరులు పాల్గొన్నారు.


సబ్ స్టేషన్‌లో అధికారులతో మాట్లాడుతున్న పర్యవేక్షక ఇంజనీరు విజయ కుమార్

సబ్ స్టేషన్లలో విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజనీరు తనిఖీ

రొంపిచర్ల, ఏప్రిల్ 10 (ఆంధ్రజోతి): మండంలోని రొంపిచర్ల, సుబ్బయ్యపాలెం గ్రామాల్లోని విద్యుత్ సబ్ స్టేషన్‌లను ఆ శాఖ పర్యవేక్షణ ఇంజనీరు డాక్టర్ పత్తిపాటి విజయ కుమార్ గురువారం పరిశీలించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలన్నారు. అధికారులు, సిబ్బందితో మాట్లాడుతూ వంద శాతం విద్యుత్ రెవెన్యూ వసూలు చేయాలన్నారు. ప్రతి నెల రెండో శనివారం లైన్‌లు మరమ్మతులు చేయాలన్నారు. నూతన సర్వీసుల మంజూరు, 50 శాతం రాయితీతో అదనపు లోడును క్రమబద్ధీకరించుకొనుటకు జూన్ 30వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. వినియోగదారులకు ఈ విషయంపై అవగాహన కల్పించాలన్నారు. అదనపు లోడును రెగ్యులరైజ్ చేయించుకోవాలని, వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ఆయన వెంట రూరల్ డీఈఈ వెంకటేశ్వర్‌రెడ్డి, రొంపిచర్ల ఏఈఈ జే రాంబాబు పాల్గొన్నారు.